# ఫుడ్ పాయిజన్ ఘటనపై చర్యలు




-డిప్యూటీ వార్డెన్, హెచ్ఎం సస్పెన్షన్
-కలుషిత ఆహారంతో విద్యార్థినులు అస్వస్థత
-నాణ్యమైన భోజనం అందించాలని కలెక్టర్ ఆదేశం


www.prajapaksham.in

ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

స్తంభాద్రి భద్రాద్రి

ఆదివారం | 15 | మార్చి | 2026 పేజీలు : 8


# ప్రణాళికాబద్ధ ఆలోచనతోనే అభివృద్ధి




-హక్కుల కోసం ఐక్య పోరాటం
-రాజ్యాంగ పరిరక్షణ ప్రతి పౌరుని కర్తవ్యం
-మీడియా అకాడమీ ఛైర్మన్ శ్రీనివాసరెడ్డి






**ప్రజాపక్షం/ ఖమ్మం :** స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు ప్రణాళికబద్దంగా ఆలోచన చేసి నిధులను సాధించగలిగితే త్వరితగతిన అభివృద్ధి సాధ్యపడుతుందని తెలంగాణ మీడియా అకాడమీ ఛైర్మన్ కె. శ్రీనివాసరెడ్డి తెలిపారు. ప్రజాప్రతినిధులు తమ బాధ్యతలను సక్రమంగా నిర్వర్తిస్తూ హక్కులు, నిధుల కోసం పోరాడాలని ఆయన సూచించారు. పాల్వంచ సుగుణ గార్డెన్స్‌లో సిపిఐ రాష్ట్ర స్థాయి ప్రజాప్రతినిధుల శిక్షణా శిబిరంలో భాగంగా శనివారం భారత రాజ్యాంగం స్థానిక సంస్థలు అభివృద్ధి, ప్రజాప్రతినిధులు నిధులు, విధులు అనే అంశంపై బోధించారు. భారతదేశ పౌరులుగా ఉన్న ప్రతి ఒక్కరూ భారత రాజ్యాంగానికి లోబడి పని చేయాలని రాజ్యాంగం గురించి తెలుసుకోవాలని భారత రాజ్యాంగంలో అందరికీ సమానమైన హక్కులు కేటాయించబడ్డాయన్నారు. భారత రాజ్యాంగం అమల్లోకి వచ్చిన తర్వాత స్థానిక ప్రభుత్వాల విషయంలో కొంత నిర్లక్ష్యం ఉండేదని 73, 74 రాజ్యాంగ సవరణ తర్వాత తప్పనిసరిగా ఎన్నికలు నిర్వహిస్తేనే నిధులు కేటాయించే పరిస్థితి ఏర్పడిందన్నారు. ఉదాహరణకు తెలంగాణలో పంచాయతీ ఎన్నికలు సకాలంలో నిర్వహించకపోవడంతో కేంద్రం నిధులు నిలిపివేసిందని పంచాయతీ


మిగతా 2లో..


# నిర్లక్ష్యమా.. నకిలీనా..!


L.Dis.No.C/172/2026

Form-10
(See Rule 13)

Office of the Tahsildar,
Bonakal, Dt: 26.03.2026.

**Non – Availability Certificate**

(Issued under Section 17 of the Registration of Births & Deaths Act, 1969)

This is to certify that a search has been made on the request of Sri/Smt/Kum of **Samineni Siresha D/o Ravi** in the registration records for the year(s) 2009 relating to **Govindapuram (L)** Village of Bonakal Mandal of Khammam District of State of Telanagana and found that the event relating to the Birth of **Samineni Siresha D/o Ravi** on 18-05-1989 was not registered.

**Note**:- This Certificate is not a Certificate of identity or Address or date of Birth or place of Birth of the person.

Certified by

Name:-G. Sudheer
Tahsildar(I/C),Bonakal Mandal.
Khammam District.

TAHSILDAR OFFICE Bonakal Mandal Khammam Dist.

-ముందస్తు ధృవపత్రంపై విస్తృత చర్చ
-తహసీల్దార్ కార్యాలయంలో ధృవపత్రాల లీలలు

**ప్రజాపక్షం/ ఖమ్మం :** మార్చి 26వ తేదీకి మరో 11 రోజులు ఉంది. కానీ 26 మార్చి 2026 తేదీన బోనకల్ తహసీల్దార్ కార్యాలయం నుంచి విడుదలైన ఒక ధృవపత్రంపై విస్తృతంగా చర్చ సాగుతుంది. అసలు ఈ ధృవపత్రం జారీలో అధికారులు నిర్లక్ష్యం పాటించారా లేక నకిలీ ధృవపత్రాలను తయారు చేస్తున్నారా అన్న ప్రశ్న ఉదయిస్తుంది. బోనకల్ మండలం గోవిందాపురం గ్రామానికి చెందిన సామినేని రవి కుమార్తె శిరీషకు నాన్ ఎవెలబులిటి సర్టిఫికెట్‌ను జారీ చేశారు. మండల పరిధిలోని గోవిందాపురం ఎల్ గ్రామానికి చెందిన శిరీష పుట్టిన తేదీ 18 మే 1989 అని కానీ అది ఎక్కడ రిజిస్టర్ కాలేదని ధృవీకరించారు. ఈ ధృవీకరణ పత్రం బోనకల్ తహసీల్దార్ జి. సుధీర్ పేరుతో విడుదలైంది. మార్చి 26 మరో 11 రోజులు ఉండగా ఈ ధృవ పత్రం విడుదలైంది. బోనకల్ మండలం, జిల్లా వ్యాప్తంగా ఎవరైనా ప్రభుత్వ కార్యాలయాల నుండి కాకుండా తామే సొంతంగా నకిలీ ధృవపత్రాలను జారీ చేస్తున్నారా లేక మండలాధికారుల నిర్లక్ష్యమా అన్నది తేలాల్సి ఉంది. దీనిపై ఎంఆర్‌వో జి. సుధీర్‌ను వివరణ కోరేందుకు ఫోన్ ద్వారా ప్రయత్నించగా ఆయన సమాధానం ఇవ్వలేదు. ఇప్పటికే బోనకల్ మండల కార్యాలయంపై పలు విమర్శలు వెల్లువెత్తున్నాయి. ప్రతి ధృవపత్రానికి ఒక రేటు కట్టి ముక్కుపిండి వసూలు చేస్తున్నారన్న ఆరోపణలు వినవస్తున్నాయి. ప్రభుత్వ నిబంధన


మిగతా 2లో..


# నేడు సిపిఐ కార్యాలయం ప్రారంభం

-హాజరుకానున్న కూనంనేని, బాగం, దండి తదితరులు



**ప్రజాపక్షం/ బోనకల్ :** బోనకల్ మండల కేంద్రంలో నిర్మించిన తూము ప్రకాశరావు భవన్‌ను ఆదివారం ప్రారంభించనున్నారు. ఆదివారం సాయంత్రం నాలుగు గంటలకు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు కార్యాలయాన్ని ప్రారంభిస్తారని ప్రారంభ కార్యక్రమానికి సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు, జిల్లా కార్యదర్శి దండి సురేష్, రాష్ట్ర కంట్రోల్ కమిషన్ ఛైర్మన్ మహ్మద్ మౌలానా, జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్ రెడ్డి, రాష్ట్ర నాయకులు కొండపర్తి గోవిందరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు తోట రామాంజనేయులు, ఏనుగు గాంధీ లతో పాటు తూము రోషన్‌కుమార్, బత్తినేని నాగప్రసాద్, నీరజ, బత్తినేని రాకేష్, ప్రకాష్‌లు హాజరవుతారని సిపిఐ మండల కార్యదర్శి యంగల ఆనందరావు తెలిపారు. ప్రారంభ కార్యక్రమానికి సిపిఎం, కాంగ్రెస్, టిడిపి లతో పాటు వివిధ రాజకీయ పక్షాల నేతలను ఆహ్వానించినట్లు ఆయన తెలిపారు. మారుతున్న సామాజిక, ఆర్థిక, రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో ప్రజల అవసరాలకు అనుగుణంగా కమ్యూనిస్టు పార్టీ నేతృత్వంలో బలమైన ప్రజా ఉద్యమ నిర్మాణాలకు ఈ కార్యాలయం వేదిక కానుందని ఆనందరావు తెలిపారు. రానున్న కాలంలో కమ్యూనిస్టుల అవసరం మరింత పెరగనుందని ఇప్పటికే పాలకులు ప్రజలను విస్మరించి పాలన సాగిస్తున్నారని ఆయన తెలిపారు. ఒక పక్క మతోన్మాదం, మరో పక్క ఆర్థిక అంతరాలు పెరుగుతున్న నేపథ్యంలో దేశంలో కమ్యూనిస్టుల అవసరం పెరుగుతుందని తూము ప్రకాశరావు భవనం రానున్న కాలంలో కమ్యూనిస్టు పార్టీ విస్తరణకు బలోపేతానికి ఉపయోగపడనుందని ఆనందరావు తెలిపారు. వామపక్ష అభిమానులు, కమ్యూనిస్టు పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# ప్రణాళికాబద్ధ ఆలోచనతోనే అభివృద్ధి

(మొదటిపేజీ తరువాయి)
ఎన్నికలు జరిగిన తర్వాత ఇప్పుడు నిధులు విడుదల చేసిందని శ్రీనివాసరెడ్డి తెలిపారు. గ్రామ పంచాయతీలకు 90 శాతం నిధులు జనాభా ప్రతిపాదికన పది శాతం నిధులు వైశాల్యం ప్రతిపాదికన కేటాయించబడతాయన్నారు. నిధుల కేటాయింపులో ఎటువంటి వివక్షత ఉండదన్నారు. గ్రామ పంచాయతీ లేదా మున్సిపల్, కార్పోరేషన్ ప్రతినిధులు ముందుగా తమ విధులు, బాధ్యతలను గుర్తెరగాలని ఆయన సూచించారు. అధికారాన్ని గ్రామాల అభివృద్ధికి ఉపయోగించాలని సిపిఐ ప్రజాప్రతినిధులు మంచిని ప్రోత్సహిస్తూ అభివృద్ధి పదంలో నడిపించినప్పుడే పార్టీకి గుర్తింపు లభిస్తుందన్నారు. భారత రాజ్యాంగంలో కొన్ని అంశాలు మార్చలేనివి ఉన్నాయని ప్రజాస్వామ్య, లౌకిక, సామ్యవాద, సమానత్వ, గణతంత్ర విధానాన్ని మార్చే ప్రసక్తే లేదని ఆయన తెలిపారు. భారత రాజ్యాంగం గురించి, దేశభక్తి గురించి మాట్లాడుతున్న బిజెపి లేదా దాని అనుబంధ ఆర్ఎస్ఎస్ మొదలైనవి రాజ్యాంగం అమల్లోకి వచ్చిననాడు తమ పత్రిక ఆర్గనైజర్‌లో దేశానికి ఇక దుర్దినమని ప్రకటించారని రాజ్యాంగం ఆమోదం పొందిన తర్వాత ఇక చీకటి రోజులంటూ వార్తలు ప్రచురించడంతో పాటు జాతీయ జెండాను ఏనాడు ఆర్ఎస్ఎస్ ఇతర బిజెపి అనుబంధ సంస్థలు గౌరవించ లేదన్నారు. నాగపూర్‌లోని బిజెపి కేంద్ర కార్యాలయంలో బిజెపి అధికారంలోకి వచ్చేంత వరకు జాతీయ జెండాను ఆవిష్కరించలేదని శ్రీనివాసరెడ్డి తెలిపారు. గతంలో జాతీయ జెండా మార్పు ఇతర అంశాలకు సంబంధించి అనేక అనాధికార తీర్మానాలను ప్రవేశపెట్టారని ఇప్పుడు 460 సీట్లు అడుగుతున్నది కూడా రాజ్యాంగాన్ని మార్చడానికేనని ఆయన అన్నారు. ప్రజలకు అనుకూలంగా చట్టాలు చేయడం తప్పు కాదని ఆయన తెలిపారు. ప్రభుత్వ రంగాన్ని ప్రైవేటీకరించడం ద్వారా అణగారిన వర్గాలు రాజ్యాంగం ద్వారా పొందిన హక్కులను కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. బడ్జెట్‌పై ఆయన మాట్లాడుతూ మోసపూరిత లెక్కలు ప్రజా జీవితాలను ఛిద్రం చేస్తున్నాయని తలసరి ఆదాయం పెంపు కూడా ఇబ్బందికరమేనన్నారు. తెలంగాణలో సైతం పదివేల కోట్లు పై బడిన సంపన్నులు తయారయ్యారని ఆయన తెలిపారు. దేశ పౌరులుగా హక్కుల కోసం పోరాడటంతో పాటు బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించాలన్నారు. ఆర్టిఐ మాజీ కమిషనర్ ప్రొ॥ మాడబూసి శ్రీధర్ మాట్లాడుతూ కమ్యూనిస్టు ప్రజాప్రతినిధులు ప్రజాసేవకులన్నారు. పార్లమెంటు, శాసనసభల మాదిరి గ్రామసభకు కూడా ఒక బాధ్యతాయుత గౌరవం ఉందని ఆయన తెలిపారు. సమాచార హక్కు చట్టాన్ని నిర్వీర్యం చేస్తున్నారని ఆయన ఆరోపించారు. భారత రాజ్యాంగంలో ఉన్న ఫెడరల్ వ్యవస్థను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఈ శిక్షణా తరగతుల్లో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, జాతీయ కార్యదర్శి కె. రామకృష్ణ, జాతీయ కార్యవర్గ సభ్యులు పశ్య పద్మ, అక్కినేని వనజ, సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దండి సురేష్, ఎస్‌కె సాబీర్ పాషా, జమ్ముల జితేందర్‌రెడ్డి, ముత్యాల విశ్వనాథం, కల్లూరు వెంకటేశ్వర్లు, భిక్షపతి, కొత్తగూడెం మేయర్ మూడు గణేష్ తదితరులు పాల్గొన్నారు.

# జనం మన్ననలు పొంద గలిగిన వారే నిజమైన నాయకులు

- కమ్యూనిస్టు ప్రజాప్రతినిధులు ప్రజలతో మమేకం కావాలి
- సమస్యలపై దృష్టి సారించి పరిష్కరించాలి : కూనంనేని




ప్రజాపక్షం/కొత్తగూడెం : జనం మన్ననలు పొందగలిగిన వారే నిజమైన నాయకులు అని, కమ్యూనిస్టు ప్రజాప్రతినిధులు అనునిత్యం ప్రజలతో మమేకం కావాలిని సిపిఐ రాష్ట్రకార్యదర్శి, కొత్తగూడెం శాసన సభ్యులు కూనంనేని సాంబశివ రావు అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో సిపిఐ ఆధ్వర్యంలో గెలుపొందిన ప్రజాప్రతినిధులకు పాల్వంచలోని సుగుణ గార్డెన్స్‌లో జరుగుతున్న రెండో రోజు శిక్షణా తరగతుల్లో ఆయన మాట్లాడారు. కమ్యూనిస్టు నాయకులకు పదవుల కంటే ప్రజలే ముఖ్యమని, ఆ పదవులే కావాలనుకుంటే జ్యోతిబసు లాంటి కమ్యూనిస్టు యోధులు ఏ నాడో ప్రధాని అయ్యేవారని తెలిపారు. చంద్రా రాజేశ్వరరావు లాంటి నేత పార్టీ నిర్మాణానికి, ప్రజాపోరాటలకే ప్రాధాన్యత ఇస్తూ ఎంఎల్‌సి పదివిని తృణప్రాయంగా భావించి రాజీనామా చేశారని తెలిపారు. కమ్యూనిస్టు నేతలెవ్వరూ ఆడంబరాలకు పోకుండా ప్రజా జీవితాన్ని గడిపారని, పుచ్చలపల్లి సుందరయ్య వంటి నాయకులు సైకిల్‌పై పార్లమెంట్‌కు వెళ్లారని, గుమ్మడి నర్సయ్య సాదా సీదా జీవనాన్ని సాగిస్తున్నారని, రజబ్ అలీ వంటి మేధావులు కమ్యూనిజమే ఊపిరిగా బ్రతికారని చెప్పారు. వీరంతా ప్రజాసేవలో ఆదర్శమూర్తులని చెప్పారు. వీళ్లందరితో పోల్చుకుంటే మనం చాలా తక్కువని, స్వార్ధ ప్రయోజాలకుచ తావులేని ప్రజాసేవకు అంకితం కావాలన్నారు. వందేళ్ల కమ్యూనిస్టు పార్టీలో ప్రజాప్రతినిధులుగా ఎన్నికై ప్రజా సేవ చేసేందుకు ముందుకు రావాడం గొప్ప విషయమని, నిబద్ధతతో పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి పనిచేయాలన్నారు. కమ్యూనిస్టు నాయకునిగా ఉంటే ఆ విలువేవేరని, అన్యాయం రాజ్యమేలుతున్నప్పుడు ప్రజల కమ్యూనిస్టులను కోరుకుంటారని కమ్యూనిస్టుల దగ్గరకు వెళితే సమస్యలు తీరుతాయనే నమ్మకం ప్రజల్లో ఉందని, దానికి అనుగుణంగా పనిచేయాలన్నారు. ప్రతీ రోజు ప్రజాప్రతినిధులు వారివారి వార్డుల్లో, డివిజన్లలో తిరగాలాని, ఆత్మీయానుబంధాలు పెంచుకోవాలని, సమస్యలపై అవగాహన పెంచుకోవాలన్నారు. మన ప్రాంతంలోనే కాకుండా జిల్లా నలుమూలల, రాష్ట్ర వ్యాప్తంగా, దేశంలో ఏం జరుగుతుందో తెలుసుకునేందుకు వార్తా పత్రికలు చదవాలని, పుస్తక పఠనం అలవర్చుకోవాలని, చట్టాలపై అవగాహన పెంచుకోవాలని తెలిపారు. కొందరు కమ్యూనిస్టులపై అవాకులు చెవాకులు పేలుతున్నారని, సిట్ల సర్దుబాటు సమస్య కారణంగా విడివిడిగా స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయాల్సి వచ్చిందని, ఆ సమయంలో కూడా మనస్సుకు గాయం అయ్యేలా కొందరు ఇష్టాను సారంగా మాట్లాడారని, ఆ కసితో గ్రామ పంచాయితీ ఎన్నికల్లో పనిచేశామని, వారి కంటే మూడు వేల ఓట్లు అత్యధికంగా నియోజకవర్గంలోని గ్రామపంచాయితీల్లో పోలయ్యాయని చెప్పారు. కార్పొరేషన్ ఎన్నికల్లో సైతం ఇదే తతంగం సాగిందని, దీనిని కూడా సవాల్‌గా తీసుకుని కొత్తగూడెం కార్పొరేషన్ ఎన్నికల్లో విజయ ఢంకా మోగించి మేయర్ పీఠాన్ని కైవసం చేసుకున్నామని తెలిపారు. అహం భావం పతనానిక నాంది అని, ప్రజల కోసం నిస్వార్థ పూరిత జీవితం గడిపిన వారు చరిత్రలో నిలిచిపోతారని, తాత్విక ఆలోచనలతో ముందుకు సాగాలని కూనంనేని తెలిపారు. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి, సర్పంచ్ సుజన్ అ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మీడియా అకాడమి చైర్మన్ కే శ్రీనివాసరెడ్డి, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పశ్య పద్మ, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా, బేజవాడ వెంకటేశ్వరరావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముత్యాల విశ్వనాధం, కల్లూరి వెంకటేశ్వరరావు, క్రి బిక్షపతి, అజయ్ సారధి, మూడ్ గణేషలు పాల్గొనగా మునిగడప పద్మ, ఉమా వాసిరెడ్డి మురళీ స్టీరింగ్ కమిటీ సభ్యులుగా వ్యవహరించారు.

## 20వ వార్డులో క్లీన్ అండ్ గ్రీన్



ప్రజాపక్షం/వైరాః వైరా మున్సిపాలిటీ పరిధిలోని 20వ వార్డులో ప్రజాపాలన ప్రగతి కార్యక్రమంలో భాగంగా క్లీన్ అండ్ గ్రీన్, పారిశుద్ధ్య పనులు కొనసాగుతున్నాయి. పనులను వార్డు కౌన్సిలర్ వుంద్రు వరలక్ష్మి, శ్యామ్‌బాబు పర్యవేక్షిస్తున్నారు. వార్డులో ప్రజల సమస్యలకు అనుగుణంగా మున్సిపల్ సిబ్బందితో ముమ్మరంగా పనులను కౌన్సిలర్ వరలక్ష్మి చేయిస్తున్నారు. ఈ కార్యక్రమంలో పలువురు వార్డు ప్రజలు పాల్గొన్నారు.

## అజ్మీర తండాలో పారిశుద్ధ్య పనులు



ప్రజాపక్షం/తిరుమలాయపాలెం : తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రంలో గ్రామాల అభివృద్ధికై చేపట్టిన 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా చేపట్టిన కార్యక్రమాన్ని మండల పరిధిలోని అజ్మీర తండాలో గ్రామ సర్పంచ్ అజ్మీర నీలిమ బాలాజీ ఆధ్వర్యంలో పారిశుద్ధ్య కార్యక్రమాలపై దృష్టి సారించారు. గ్రామంలో సైడ్ కాలువలలో మట్టి తీయుట గ్రామంలోని పురవీధులన్నీ శుభ్రపరచుట మంచినీటి ట్యాంకు శుభ్రపరచుట మిషన్ భగీరథ పైప్ లైన్లు మరమ్మతులు చేపట్టుట మంచినీటి బావి మోటార్లను పైపులైను సరి చేయుట గ్రామంలోని అన్ని మౌలిక వసతులు కల్పనకై కృషి చేస్తున్నామని ప్రతి రూపాయి గ్రామ అవసరాలకు వినియోగిస్తున్నామని ఆమె తెలిపారు. పాలేరు శాసనసభ్యులు రాష్ట్ర రెవిన్యూ గృహ నిర్మాణ సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో గ్రామం ఎంతో అభివృద్ధి చెందుతుందని రానున్న రోజుల్లో గ్రామంలోని అంతర్గత సిసి రోడ్లు నూతన గ్రామపంచాయతీ బిల్డింగ్ నిర్మాణం స్థలాన్ని పరిశీలిస్తున్నామని ఆమె తెలిపారు. గ్రామం నుండి జల్లేపల్లి గ్రామంలో ఉన్న హై స్కూల్ కు అజ్మీర్ తండా పిల్లలు వెళ్లేందుకు ఇబ్బంది ఎదుర్కొంటున్నారని అజ్మీర తండా నుంచి జల్లేపల్లి వరకు ఆర్టీసీ బస్సును నడిపించాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమం లో ఉప సర్పంచ్ చందావత్ జ్యోతి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు సొసైటీ మాజీ సొసైటీ డైరెక్టర్ అజ్మీర బాలాజీ, పంచాయతీ కార్యదర్శి రహీం, దేశ్య తదితరులు పాల్గొన్నారు.

# ప్రపంచ కార్మిక వర్గానికి మార్గదర్శకుడు కారల్ మార్క్స్



ప్రజాపక్షం/ కొత్తగూడెం : ప్రపంచ కార్మిక వర్గానికి మార్గదర్శకుడు, మహాతత్వవేత్త కారల్ మార్క్స్ అని సిపిఐ రాష్ట్రకార్యదర్శి, ఎంఎల్‌ఏ కూనంనేని సాంబశివరావు అన్నారు. మార్క్స్ 143వ జయంతిని శనివారం సుగుణ గార్డెన్స్‌లో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళ్లర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆయన ప్రతిపాదించిన సమానత్వభావాలు శ్రమ జీవుల హక్కుల కోసం చేసిన సిద్ధాంత పోరాటం ప్రపంచ వ్యాప్తంగా కార్మిక ఉద్యమాలకు మార్గదర్శకంగా నిలిచిందన్నారు. సమాజంలో అసమానతలను తొలగించి సమాన హక్కులు సాధించాలన్న లక్ష్యంతో ఆయన చేసిన కృషి ఎప్పటికీ స్ఫూర్తి దాయకమని చెప్పారు. ప్రస్తుత కాలంలో కూడా మార్క్స్ ఆలోచనలు సమాజ మార్పుకు మార్గం చూపుతున్నాయని, కార్మికులు,రైతులు ఐఖ్యంగా పోరాడితేనే సమాజంలో నిజమైన మార్పు సాధ్యమవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు పశ్య పద్మ, బెజవాడ వెంకటేశ్వరరావు, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముత్యాలవిశ్వనాధం, కల్లూరివెంకటేశ్వరరావుతో పాటు , వాసిరెడ్డి మురళీ, సరెడ్డి పుల్లారెడ్డి, వీశంశెట్టి పూర్ణ చంద్రరావు, ఉప్పుశెట్టి రాహుల్, జిల్లా నాయకులు, ప్రజా సంఘాల బాధ్యులు తదితరులు పాల్గొన్నారు.

# నిర్లక్ష్యమా.. నకిలీనా..!

(మొదటిపేజీ తరువాయి) లను తోసిపుచ్చి తహసీల్దార్ కార్యాలయం సాక్షిగా పనులు జరుగుతున్నాయని ఆరోపణలు వినవస్తున్నా నేపథ్యంలో ఇప్పుడు ఈ ధృవపత్రం ఆరోపణలకు సాక్షిగా నిలిచింది. ఇసుక కూపన్లు మొదలు అన్నింటిలోనూ అవినీతికి కేరాఫ్‌గా మారిందన్న ఆరోపణల నేపథ్యంలో ఇప్పుడు ముందస్తు తారీఖుతో విడుదలైన ఈ ధృవీకరణకు సంబంధించి అధికారులు ఏమి సమాధానం చెబుతారో వేచి చూడాలి. అసలు ఈ ధృవపత్రం తహసీల్దార్ కార్యాలయం నుంచి ఇచ్చారా లేక ఎవరైనా నకిలీలు సృష్టించారా అన్నది కూడా ఉన్నతాధికారులు విచారణ చేసి తేల్చాలని స్థానికులు కోరుతున్నారు.

## గ్యాస్ సరఫరాపై గందరగోళాన్ని తొలగించండి




ప్రజాపక్షం/ తల్లాడ : గ్యాస్ సరఫరాపై ప్రస్తుతం నెలకొన్న గందరగోళాన్ని వెంటనే తొలగించాలని మాచర్ల భారతి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తల్లాడ మండల కేంద్రంలో సిపిఎం పార్టీ మండల కమిటీ సమావేశం కళ్యాణపు కృష్ణయ్య అధ్యక్షతన పార్టీ కార్యాలయంలో జరిగింది. ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యురాలు మాచర్ల భారతి పాల్గొని మాట్లాడుతూ అమెరికా సామ్రాజ్య వాదం కాంక్షతో పెట్రోల్ ఉత్పత్తులను తమ ఆధీనంలోకి తెచ్చుకోవడం కోసం ఇజ్రాయిల్ ఇరాన్ మధ్య యుద్ధాన్ని సృష్టించిందని, ఇటీవల వెనిజులా అధ్యక్షుడిని అతని భార్యను ఆదేశంపై దాడి చేసి తీసుకుచ్చి జైలులో పెట్టిందని అన్నారు. ఫిబ్రవరి 22న ఇరాన్‌పై అమెరికా ఇజ్రాయిల్ చేసిన దాడిలో ఆదేశ అధ్యక్షుడుతో పాటు వేలాదిమంది ఇరాన్ పౌరులు మరణించారని, దీని ఫలితంగా ప్రపంచ దేశాలన్ని ఆర్థిక పరిస్థితులను ఎదుర్కొంటున్నాయని, వెంటనే యుద్ధాన్ని నిలిపివేసే విధంగా ఇరాన్‌కు బాసటగా మనమందరం నిలవాల్సిన బాధ్యత మన ముందు ఉన్నదని అన్నారు. యుద్ధఫలితాలు ప్రస్తుతం తీవ్రస్థాయి చేరి గ్యాస్ వ్యవసాయ రంగం చిన్న చిన్న వ్యాపార రంగాలు దెబ్బతినే ప్రమాదం ఉందని అన్నారు. ఈ సమావేశంలో పార్టీ డివిజన్ కార్యదర్శి సేలం సత్యనారాయణరెడ్డి, మండల కార్యదర్శి అయినాల రామలింగేశ్వరరావు, నల్లమోతు మోహన్‌రావు, పులి కృష్ణయ్య, చల్లా నాగేశ్వరరావు. షేక్. మస్తాన్, నన్నేసాహెబ్, కట్ట దుర్గారావు, మేడీ భిక్షం తదితరులు పాల్గొన్నారు.

## ప్రశాంతంగా ప్రారంభమైన పది పరీక్షలు




ప్రజాపక్షం/వైరాః పదో తరగతి పరీక్షలు పెల్లిరోజు ప్రశాంతంగా ముగిశాయి. నాలుగు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. పరీక్ష కేంద్రాల వద్ద గట్టి బందోబస్తు నిర్వహించారు. తెలుగు పరీక్షకు గాను మొత్తం 747 మంది విద్యార్థులకు 745 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఇద్దరు విద్యార్థులు గైర్హాజరయ్యారు. మండల విద్యాశాఖ అధికారి కొత్తపల్లి వెంకటేశ్వరరావు పరీక్ష కేంద్రాలను పరిశీలిస్తూ ఎప్పటికప్పుడు కేంద్రాల వద్ద పలు సూచనలు చేశారు. విద్యార్థులు సమయపాలన పాటించి పరీక్ష కేంద్రాల వద్దకు చేరుకున్నారు. ఎక్కడ ఎలాంటి సంఘటన జరగకుండా తొలిరోజు పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి.

# భూదాన్ కమిటీ ముఠా కోసం ప్రత్యేక బృందం

**- వెలుగుమట్ల భూ వివాదాలపై 24 కేసులు**
**- 60 మంది నిందితులు...11 మంది అరెస్ట్**
**- అడిషనల్ డిసిపి ప్రసాద్‌రావు**



ప్రజాపక్షం/ఖమ్మం క్రైం : ఖమ్మం అర్బన్ మండలం వెలుగుమట్ల భూదాన్ కమిటీ ముఠా సభ్యులను పట్టుకుని పేదల నుంచి వసూలు చేసిన నగదును రికవరీ చేసేందుకు ముగ్గురు సిఐలతో కూడిన ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసినట్లు అడిషనల్ డిసిపి లా అండ్ ఆడర్ ప్రసాద్ రావు తెలిపారు. ఆయన మీడియాకు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. భూదాన్ భూముల్లో దురాక్రమణకు పాల్పడి పేదలను మోసగించిన వారిపై ఫిర్యాదుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోందన్నారు. యూసి సిఆర్‌పిఎల్ (ఎంఎల్) ఓపిడిఆర్ భూదాన్ కమిటీ సభ్యులమని తప్పుడు ప్రచారంతో నిరుపేదల నుంచి సుమారు 3 కోట్లు రూపాయల వరకూ వసూళ్లకు పాల్పడి మోసం చేశారని ఆయన చెప్పారు. పోలీసు కమిషనర్ సునీల్‌దత్ ఆదేశాల మేరకు బాధితుల నుంచి వసూలూ చేసిన నగదు మొత్తాన్ని రికవరీ చేసే దిశగా పోలీసు శాఖ చర్యలు చేపట్టింద న్నారు. జిల్లా వ్యాప్తంగా ఆరు పోలీసు స్టేషన్లలో ఇప్పటి వరకూ అందిన ఫిర్యాదుల మేరకు 24 కేసులు నమోదు అయినట్లు తెలిపారు. వీటిలో ఖానాపురం హావేలీలో 19 కేసులు, రఘునాథపాలెం, కోణిజర్ల, చింతకాని, సత్తుపల్లి, ఏన్కూరు స్టేషన్లలో ఒక్కొక్కటి చొప్పున మొత్తం 24 కేసులు నమోదైయ్యాయని పేర్కొన్నారు. ఈ కేసుల్లో 60 మంది నిందితులు కాగా ఇప్పటి వరకూ 11 మందిని అరెస్ట్ చేశామన్నారు. తమకు అందుతున్న ఫిర్యాదుల్లో దాదాపు నిందితుల పేర్లు ఒకే విధంగా ఉన్నాయని చెప్పారు. వెలుగుమట్ల బాధితులకు ఇచ్చిన హామీ మేరకు నిందితుల నుంచి వసూలు చేసిన నగదును తిరిగి రాబట్టే దిశగా చర్యలు ప్రారంభించామన్నారు. ఇందులో భాగంగా ముగ్గురు సిఐలతో కూడిన ప్రత్యేక బృందం ఏర్పాటు చేశామని వారితో సొమ్ము రికవరీకి అవసరమైన చర్యలు ప్రారంభించామన్నారు. బాధితుల నుంచి వసూలు చేసిన డబ్బుతో నిందితులు ఆస్తులు సంపాదించినా, కొనుగోలు చేసినా వాటిని గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు. బాధితుల సొమ్మును రికవరీ చేసి వారికి అప్పగించే వరకూ పోలీసుశాఖ చిత్తశుద్ధితో ఉందని అన్నారు. అరెస్ట్ అయిన వారిలో సూర్యపేట జిల్లా మోతె మండలం నామవరం గ్రామానికి చెందిన కొప్పెర వెంకన్న, ప్రస్తుతం వెలుగుమట్ల, వినోబానగర్ కాలనీలో ఉంటున్న ఏన్కూరు మండలం కేసుపల్లి, బురదరాఘవపురం, లచ్చగూడెం గ్రామాలకు చెందిన కొట్టే బసు, బల్లి శ్రీనివాసరావు, మంకిడి లింగరాజు అలియాస్ ఇంకిడి లింగరాజు, ఖమ్మం అర్బన్ మండలం గోపాలపురం గ్రామానికి చెందిన సంపంగి వెంకటాచలం, వినోబానగర్ కాలనీలో ఉంటున్న కవిరాజు నగర్ ప్రాంతానికి చెందిన తాళ్లూరి కృష్ణ, వెలుగుమట్ల గ్రామానికి చెందిన ముదిగ అలియాస్ బుడిగె రాములు, భూదాన్ కాలనీలో ఉంటున్న ఖమ్మం సహకార నగర్‌కు చెందిన రాచకొండ నర్సింహచారి అలియాస్ చారి, ఖమ్మం త్రీటౌన్ ప్రాంతంలోని బోసు బొమ్మ సెంటర్‌కు చెందిన దండా లింగయ్య, కామేపల్లి మండలం మద్దులపల్లి గ్రామానికి చెందిన యూసిసిఆర్ఐ (ఎంఎల్) ఆర్గనైజర్ పోలేబోయిన ముత్తయ్య, దండా లింగస్వామి అరెస్ట్ అయిన వారిలో ఉన్నట్లు అడిషనల్ డిసిపి ప్రసాద్‌రావు తెలిపారు.

# గ్యాస్ బుకింగ్‌తో సైబర్‌మోసాలు

**- అప్రమత్తంగా ఉండాలి : సిపి**



ప్రజాపక్షం/ఖమ్మం క్రైం : గ్యాస్ సిలిండర్ బుకింగ్ పేరుతో జరుగుతున్న సైబర్ మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలీసు కమిషనర్ సునీల్‌దత్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నకిలీ వాట్సాప్, మెసెజ్ లింకులు పంపుతూ బుక్ చేసిన వెంటనే గ్యాస్ డెలవరీ ఆశచూపి నేరగాళ్లు అడ్వాన్స్‌గా డబ్బులు, కెవైసి అప్‌డేట్ పేరుతో ఓటిపి అడగటం వంటి మోసపూరిత చర్యలకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు. అధికారిక యాప్, వెబ్‌సైట్ ద్వారా మాత్రమే బుక్‌చేసుకోవాలన్నారు. తెలియని లింక్‌లను ఓపెన్‌చేయవద్దని విజ్ఞప్తి చేశారు. ప్రాధానంగా గ్యాస్ కొరత ఉందని వెంటనే బుక్‌చేసుకోండి అని వచ్చే సందేశాలు, లింక్‌లను నమ్మవద్దన్నారు. ఇవి వ్యక్తిగత వివరాలు, డబ్బులు తస్కరించటానికి సైబర్‌కేటుగాళ్ల పన్నాగంగా గుర్తించాలన్నారు. అదేవిధంగా గ్యాస్ డెలవరీకి ముందు ఆన్‌లైన్‌లో అడ్వాన్స్‌గా డబ్బులు చెల్లించమని కోరితే అది మోసమని గ్రహించాలన్నారు. ఓటిపి, యూపిఐ పిన్ షేర్‌చేయవద్దని, ఓటిపి, కెవైసి అప్‌డేట్ పేరుతో ఎవరైనా ఫోన్ చేసి వ్యక్తిగత, బ్యాంక్ వివరాలు కోరితే నమ్మవద్దన్నారు. అధికారిక మొబైల్‌యాప్‌లు, ఏజెన్సీ వెబ్‌సైట్‌ల ద్వారా మాత్రమే బుక్ చేసుకోవాలన్నారు. ఒకవేళ ఏవరైన మోసపోతే వెంటనే సైబర్ క్రైం వైబ్‌సైట్‌లో కాని 1930 నెంబర్‌కు ఫోన్ చేసి సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేయాలని పేర్కొన్నారు.

# పది పరీక్షలు ప్రారంభం

**-తొలి రోజు ఒక్కరు గైర్హాజరు**



ప్రజాపక్షం/చింతకాని : పదో తరగతి వార్షిక పరీక్షలు చింతకాని మండలంలో శనివారం ప్ర శాంతంగా ప్రారంభమయ్యాయి. పరీక్షలు ఉద యం 9:30 గంటలకు ప్రారంభం కానుండగా విద్యార్థులు సుమారు గంట ముందుగానే పరీక్ష కేంద్రాలకు చేరుకున్నారు. తొలి వార్షిక పరీక్ష కావడంతో విద్యార్థులు తమకు ఇష్ట దైవాలకు పూజలు చేయడంతో పాటు తమ హాల్ టికెట్లకు సైతం ప్రత్యేక పూజలు చేయించుకొని పరీక్షా కేంద్రాలకు చేరుకున్నారు.చింతకాని మండల వ్యాప్తంగా మూడు పరీక్షా కేంద్రాల్లో తొలి రోజు తెలుగు పరీక్షకు మొత్తం 467 మంది విద్యార్థులకు గాను 466 మంది హాజరయ్యారని ఎంఈవో రామారావు పేర్కొన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద ఎలాంటి అవాంచనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

# పది పరీక్షా కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తు

**- పరిశీలించిన అడిషనల్ డిసిపి**




ప్రజాపక్షం/ఖమ్మం క్రైం : నగరంలోని పదవ తరగతి పరీక్ష కేంద్రాల వద్ద ఏర్పాటు చేసిన పోలీసు బందోబస్తును శనివారం అడిషనల్ డిసిపి లాఅండ్ఆడర్ ప్రసాద్‌రావు పరిశీలించారు. కమిషనరేట్ పరిధిలో 98 పరీక్ష కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు కమిషనర్ సునీల్‌దత్ ఆదేశాల మేరకు పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. వాటిని అడిషనల్ డిసిపి ప్రసాద్‌రావు పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. శాంతినగర్ ప్రభుత్వ పాఠశాలతో పాటు మాన్‌ఫోర్ట్, రాజేంద్రనగర్, నయాబజార్ పాఠశాలల్లో జరుగుతునే పరీక్ష కేంద్రాలను ఆయన సందర్శించారు. కేంద్రాల వద్ద ముందస్తుగా బిఎన్‌ఎస్‌ఎస్ సెక్షన్ 163 యాక్ట్ అమలులో ఉందని పరిసర ప్రాంతాల్లో ఇటర్‌నెట్, జిరాక్స్ సెంటర్లు, స్టేషనరీ షాపులు పరీక్ష సమయంలో మూసివేసేలా చర్యలు తీసుకోవాలని బందోబస్తులో ఉన్న పోలీసు అధికారులు, సిబ్బందికి సూచించారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా వాహన చోదకులకు సూచనలు చేసి క్రమబద్ధీకరించాలన్నారు. అదేవిధంగా సభలు, ర్యాలీలు, డిజేలతో ఉరేగింపులు, ధర్నాలు నిషేధమన్నారు. పోలీసు పెట్రోలింగ్, పటిష్ట బందోబస్తు పర్యవేక్షణ ఉండాలని పోలీసు అధికారులకు సూచించారు. నిషేధాజ్ఞాలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు.

# ప్రశాంతంగా ప్రారంభమైన పది పరీక్షలు

ప్రజాపక్షం/ ఎర్రుపాలెం : ఎర్రుపాలెం మండలంలో తొలిరోజు పదవతరగతి పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. మండలంలోని మూడు సెంటర్లల్లో మొత్తం 421మంది విద్యార్థులు కేటాయించగా దానిలో మొదటి రోజు పరీక్షకు 420మంది విద్యార్థులు హాజరైనట్లు , గురుకుల పాఠశాలలో ఒక విద్యార్థిని హాజరు కాలేదని అధికారులు తెలిపారు. పరీక్షలకు సంబంధించి పగడ్బందీగా ఏర్పాట్లు చేయటం జరిగిందని, గుర్తింపు కార్డు లేకుండా ఎవరు కూడా పరీక్షా కేంద్రాల్లోకి వెళ్లటానికి వీలు లేకుండా ఏర్పాట్లు చేసినట్లు వారు తెలిపారు. ప్రతి పరీక్ష కేంద్రంలో సిసి కెమెరాలు ఏర్పాటు చేయటం జరిగిందని ఎంఇఓ మురళీమోహన్‌రావు తెలిపారు.

# గృహ నిర్మాణాల గ్యాస్ వాణిజ్య వాపారాలకు ఉపయోగించవద్దు

**వైరా ఏసిపి ఎస్.సారంగపాణి**



ప్రజాపక్షం/వైరా: ఇటీవల అంతర్జాతీయ పరిస్థితుల ప్రభావంతో గ్యాస్ సరఫరాలో అంతరాయం కలగవచ్చని ప్రభుత్వం భావించి, రాష్ట్రవ్యాప్తంగా గృహ వినియోగ ఎల్‌పిజి సిలిండర్ల సరఫరాను సమర్థవంతంగా పర్యవేక్షించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టింది. గృహ వినియోగదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సరఫరా వ్యవస్థను కట్టుదిట్టం గా అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. అయితే కొన్నిచోట్ల గృహ వినియోగానికి మాత్రమే కేటాయించిన ఎల్‌పిజి సిలిండర్లు వాణిజ్య అవసరాలకు(హోటళ్లు, టిఫిన్ సెంటర్లు, క్యాటరింగ్ యూ నిట్లు, ఇతర వ్యాపార సంస్థలు) ఉపయోగిస్తున్నట్లు సమాచారం అందుతుంది. ఈ విధమైన చర్యలు ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ఉండటమే కాకుండా సాధారణ గృహ వినియోగదారులకు గ్యాస్ కొరత ఏర్పడే పరిస్థితులను సష్టిస్తాయని ప్రజలకు తెలియజేడమైంది. గృహ వినియోగ ఎల్‌పిజి సిలిండర్లు కేవలం ఇంటి అవసరాలకు మాత్రమే ఉపయోగించాలి. వాణిజ్య అవసరాలకు గృహ సిలిండర్లను ఉపయోగించడం పట్ల విరుద్ధం. ఈ విధంగా గృహ సిలిండర్లను వాణిజ్య వినియోగానికి మళ్లించడం అత్యావశ్యక వస్తువుల చట్టం, సంబంధిత నియంత్రణ ఆదేశాల ప్రకారం నేరం, ఇటువంటి అక్రమ వినియోగం, నిల్వ, రవాణా లేదా విక్రయం చేసిన వారిపై సిలిండర్లు స్వాధీనం చేసుకోవడం, క్రిమినల్ కేసులు నమోదు చేయడం వంటి కఠినచర్యలు తీసుకోబడతాయి. వైరా డివిజన్ పరిధిలో హోటళ్లు, రెస్టారెంట్లు, ఫంక్షన్ హాల్స్, రోడ్డు ప్రక్కన ఉన్న ఆహార దుకాణాలు, ఇతర వ్యాపార సంస్థలపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించబడతాయి. అదువలన అన్ని వ్యాపార సంస్థలు అధికారికంగా అనుమతించిన కమర్షియల్ గ్యాస్ సిలిండర్లనే వినియోగించాలి. ప్రజలు కూడా గృహ సిలిండర్లను అక్రమంగా వాణిజ్య వ్యాపారాలకు వినియోగించినట్లయితే సమీప అధికారులకు సమాచారం అందించాలని, ఎవరైనా నిబంధన అతిక్రమించి గ్యాస్ అమ్మకాలు చేస్తే చట్టపరంగా చర్యలు తప్పని ఏసిపి అన్నారు.

# సేవా సమితి ఆధ్వర్యంలో అన్నదానం



ప్రజాపక్షం/ ఎర్రుపాలెం : మండల పరిధిలోని జమలాపురం శ్రీ వెంకటేశ్వరస్వామి అన్నదాన సేవా సమితి ఆధ్వర్యంలో శనివారం ఆలయానికి వచ్చిన భక్తులకు అన్నదానం చేశారు. దాతల సహకారంతో ప్రతి రోజూ అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సేవా సమితి అధ్యక్ష, కార్యదర్శులు బొబ్బా కృష్ణప్రసాద్, లక్కిరెడ్డి నారాయణరెడ్డి తెలిపారు. శనివారం ఆలయానికి వచ్చిన భక్తులకు ఎన్టీఆర్ జిల్లా విజయవాడ పట్టణానికి చెందిన మాలినేని వెంకటేశ్వరరావు,పద్మజ కుమారుడు కోడలు సాయి బువనేష్ జ్యోష్ణ దేవి మనుమరాలు శాన్వి, కుమారుడు సాయి వెంకటేష్‌ల వితరణతో భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గౌరవాధ్యక్షులు కొడాలి విజయ లక్ష్మీ దేవి, ఉపాధ్యక్షులు గిరిజా లక్ష్మీ , ఈశ్వర్ చంద్రవిద్యాసాగర్, చింతా కిషోర్, వీరమాచనేని వెంకటకృష్ణ, కాకుమాను లీలాకృష్ణ, ఈట అల్లూరి విష్ణుమూర్తి, చొప్పరపు శ్రీనివాసరావు, సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

# 23వ డివిజన్‌లో రంజాన్ తోఫా, దుస్తులు పంపిణీ



ప్రజాపక్షం/ ఖమ్మం : పవిత్ర రంజాన్ మాసొన్ని పురస్కరించుకుని శనివారం 23వ డివిజన్‌లో కార్పొరేటర్ షేక్ మగ్బూల్ రంజాన్ తోఫాతో పాటు దుస్తులు పంపిణీ చేశారు. కార్పోరేషన్‌లో పనిచేస్తున్న పారిశుధ్య సిబ్బంది, పంపు ఆపరేటర్స్, ఎలక్ట్రిషియన్స్ , నాలుగు డివిజన్ల జవాన్లకు సెమియా ప్యాకెట్స్, పంచదార, నెయ్యి, ఇతర సుగంధ ద్రవ్యాలతో పాటు ఇతర వస్తువులను, దుస్తులను అందజేశారు. ఈ సందర్భంగా మగ్బూల్ మాట్లాడుతూ రంజాన్ ముఖ్య ఉద్దేశం సోదర భావాన్ని పెంపొందించడం, దయ, సహనంతో ఉండటం, దాన గుణాన్ని పెంపొందించడమేనన్నారు. హిందు, ముస్లింలు ఐక్యంగా రంజాన్ పండుగను జరుపుకోవడం మత సమైక్యతకు నిదర్శన మన్నారు. ఈ కార్యక్రమంలో మత పెద్దలు ఇస్మాయిల్, లియాకత్ అలీ, గద్దం లింగమూర్తి, అజీజ్, కరీముల్లా తదితరులు పాల్గొన్నారు.

# లక్ష్మీనారాయణకి సంపూర్ణ మద్దతు



ప్రజాపక్షం/వైరా: ఈ నెల17వ తారీఖున తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ ఎన్నికలు లకిడికపూల్ వాసవి గార్డెన్స్ నందు నిర్వహించడం జరుగుతుంది. ఎన్నికల్లో అమరవాది లక్ష్మీ నారాయణ పోటీ చేయు చున్నారు. వైరా మండల ఆర్యవైశ్య మహాసభ తరపున అమరవాది లక్ష్మీ నారాయణకి సంపూర్ణ మద్దతు ప్రకటించడం జరిగింది. మీ అమూల్యమైన ఓటు అమరవాది లక్ష్మీ నారాయణకి వేసి గెలిపించాలిసిందిగా తీర్మాన చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో వైరా మండల ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు మిట్టపల్లి కిరణ్‌కుమార్, ఆర్యవైశ్య సంఘం రాష్ట్ర నాయకులు వనమా విశ్వేశ్వరరావు, ఆర్యవైశ్య కళ్యాణ మండపం అధ్యక్షుడు డాక్టర్ పెరుమాళ్ళ కృష్ణమూర్తి, ఖమ్మం జిల్లా ఆర్యవైశ్య మహాసభ మొదటి ఉపాధ్యక్షులు నూకల శ్రీనివాసరావు, నూకల ప్రసాద్‌రావు, కొమిరిశెట్టి శ్రీధర్, గజ్జల కృష్ణమూర్తి, దొడ్డా సుధాకర్, వనమా మల్లికార్జునరావు, కొల్లా రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

## ప్రశాంతంగా ప్రారంభమైన పది పరీక్షలు



**ప్రజాపక్షం/బూర్గంపాడు:** బూర్గంపాడు మండలంలో పదో తరగతి పబ్లిక్ పరీక్షలు ప్రశాంత వాతావరణంలో ప్రారంభమయ్యాయి. విద్యార్థులు ఉదయం నుంచే పరీక్షా కేంద్రాలకు చేరుకుని ఉత్సాహంగా పరీక్షలు రాశారు. విద్యార్థులు సమయానికి కేంద్రాలకు చేరుకునేలా ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించారు. పరీక్షల నిర్వహణ కోసం విద్యాశాఖ అధికారులు ముందుగానే అన్ని ఏర్పాట్లు చేశారు. పరీక్షా కేంద్రాల వద్ద తాగు నీరు. మరుగుదొడ్లు, వైద్య సదుపాయాలు ఏర్పాటు చేయడంతో పాటు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసుల పర్యవేక్షణలో పరీక్షలు నిర్వహిస్తున్నారు. మొత్తంగా 625 మంది విద్యార్థులకు గాను 623 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. పరీక్షలు సజావుగా సాగేందుకు విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారని అధికారులు తెలిపారు.

## పది పరీక్షలు ప్రారంభం



**ప్రజాపక్షం/చంద్రుగొండ:** మండలంలో పదో తరగతి పబ్లిక్ పరీక్షలు శనివారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. ఉదయం 9గంటలకు చంద్రుగొండలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, అయ్యన్నపాలెంలోని సెయింట్ జోషఫ్ పాఠశాలల్లో పరీక్షా కేంద్రాలు ప్రారంభమయ్యాయి. చంద్రుగొండ జెడ్‌పిహెచ్‌ఎస్ స్కూల్‌లో 134 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా, సెయింట్ జోషఫ్ పాఠశాలలో 140 మందికి గాను 130 మంది హాజరయ్యారు. నాలుగు మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు అధికారులు తెలిపారు. పరీక్షా కేంద్రాల్లో ఏర్పాట్లను మండల విద్యాశాఖ అధికారి సూరయ్య పరిశీలించారు. పరీక్షలు సజావుగా జరిగేలా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేసినట్లు ఎస్ఐ శివరామకృష్ణ తెలిపారు.

## ప్రారంభమైన పదో తరగతి పరీక్షలు



**ప్రజాపక్షం/కారేపల్లి:** సింగరేణి మండల పరిధిలో పదో తరగతి వార్షిక పరీక్షలు శనివారం పకడ్బందీగా ప్రారంభమయ్యాయి. ఈసందర్భంగా మండల విద్యాశాఖ అధికారి దుగ్గిరాల జయరాజు పరీక్షా కేంద్రాలను సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. పరీక్షా కేంద్రాల గేటు వద్ద తనిఖీలు నిర్వహించిన అనంతరం విద్యార్థులను లోపలికి అనుమతించారు. మండల పరిధిలోని మొత్తం మూడు పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేయగా కారేపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 201 మంది విద్యార్థులు, కారేపల్లి తెలంగాణ మోడల్ స్కూల్‌లో 190 మంది విద్యార్థులు, కోమట్లగూడెం జిల్లా పరిషత్ పాఠశాలలో 190 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. మొత్తం 27 మంది ఇన్విజిలేటర్లను విధులకు నియమించారు. కారేపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్ వద్ద సింగరేణి సర్పంచ్ మేదరి వీరప్రతాప్, రావోజీ తండా సర్పంచ్ భూక్యా బాలు నాయక్ విద్యార్థులకు ధైర్యం చెబుతూ శుభాకాంక్షలు తెలిపారు. ఈకార్యక్రమంలో వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రశాంతంగా పది పరీక్షలు



**ప్రజాపక్షం/జూలూరుపాడు:** పదో తరగతి రెగ్యులర్ పరీక్షలు శనివారం ప్రశాంతంగా జరిగాయి. తొలి పరీక్ష కావడంతో విద్యార్థుల తోపాటు తల్లిదండ్రులు పెద్ద ఎత్తున పరీక్ష కేంద్రాలకు చేరుకున్నారు. విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు చేరుకునే సమయంలో ఎటువంటి అంతరాయం లేకుండా మండలకేంద్రంలో ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. పరీక్ష కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తుతో పాటు 144 సెక్షన్ అమలు, పరీక్ష కేంద్రంలోకి విద్యార్థులు స్మార్ట్ ఫోన్, స్మార్ట్ వాచీలతో పాటు ఇతరత్రా ఎటువంటి ఎలక్ట్రానిక్ పరికరాలు లోపలకు తీసుకెళ్లకుండా ఎస్సై రవి క్షుణ్ణంగా తనిఖీ చేసిన అనంతరమే పరీక్ష కేంద్రంలోనికి అనుమతించారు. మాస్ కాపీయింగ్ చేసినా, అందుకు సహకరించినా కఠిన చర్యలు తీసుకోవాలంటూ ఎస్పీ రోహిత్ రాజు పోలీసు అధికారులను ఆదేశించడంతో జూలూరుపాడు పోలీసులు అప్రమత్తమయ్యారు. ఇక ప్రశ్నపత్రాలను స్టేషన్ల నుంచి పరీక్ష కేంద్రాలకు తరలించడం, పరీక్ష ముగిసిన అనంతరం జవాబు పత్రాలను డిపాజిట్ చేయడం వరకు పోలీసులు ప్రత్యేకంగా ఎస్కార్టు సౌకర్యం కల్పించారు.

## సిసి రోడ్డుకు ఎఎంసి చైర్మన్ శంకుస్థాపన

**ప్రజాపక్షం/ఎర్రుపాలెం :** మండల పరిధిలోని బనిగండ్లపాడు గ్రామంలో సిసి రోడ్డుకు మధిర మార్కెట్ కమిటీ చైర్మన్ బండారు నర్సింహారావు, గ్రామ సర్పంచ్ బలుసుపాటి జయరాజు, ఉపసర్పంచ్ వేమిరెడ్డి రామిరెడ్డితో కలిసి శనివారం శంకుస్థాపన చేశారు. ఉపాధి హామీ పథకం నుండి సుమారు రూ.4లక్షలు డిప్యూటీ సిఎం మల్లు భట్టివిక్రమార్క కృషితో మంజూరైనట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వేమిరెడ్డి సుధాకర్‌రెడ్డి, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు యన్నం పిచ్చిరెడ్డి, మండల నాయకులు అనుమోలు వెంకటకృష్ణా, సత్యనారాయణ, శీలం అక్కిరెడ్డి, నీలం రవికుమార్ గ్రామ పెద్దలు జవ్వాజి భాస్కర్‌రావు, ఎదురు కృష్ణారెడ్డి, పెద్దమళ్ళ రాంబాబు, బండారు శ్రీనివాసరావు, తలపెరెడ్డి రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# గ్యాస్ ఫుల్..!

- సరఫరా సాధారణంగా సాగుతుందంటున్న ఏజెన్సీలు
- వదంతులు నమ్మవద్దని అధికారులు విజ్ఞప్తి
- పెద్ద ఎత్తున బుకింగ్‌తోనే అంతరాయం
- ఈ-కేవైసీపై వినియోగదారుల్లో అనుమానాలు



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** (అమెరికాఇజ్రాయిల్ ) ఇరాన్ యుద్ధం నేపథ్యంలో వంట గ్యాస్ సిలిండర్ల కొరత ఏర్పడుతుందన్న అసత్య ప్రచారం సోషల్ మీడియాల్లో వ్యాపించడంతో ప్రజలు గ్యాస్ సిలిండర్ల కోసం ఏజెన్సీల వద్దకు పరుగులు తీస్తున్నారు. అందుకు తగ్గట్టుగానే గ్యాస్ సిలిండర్లు అందుబాటులో ఉండవన్న వదంతులు సోషల్ మీడియాలో వేగంగా వ్యాపించాయి. దీంతో అప్రమత్తమైన ప్రజలు ముందస్తుగా సిలిండర్లు తీసుకోవాలనే ఉద్దేశంతో గ్యాస్ ఏజెన్సీల వద్ద బారులు తీరుతున్నారు. వినియోగదారులు ఒకేసారి సిలిండర్ల కోసం వస్తుండటంతో తాత్కాలికంగా రద్దీ ఏర్పడింది. అయితే గ్యాస్ సరఫరాలో ఎలాంటి సమస్యలేదని, సిలిండర్ల కొరత లేదని, ఏజెన్సీ నిర్వాహకులు స్పష్టం చేస్తున్నారు. అసత్య ప్రచారాలను నమ్మకుండా వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సైతం సూచిస్తున్నారు.

### ఉగాది వరకు భారీగా నిల్వలు...

వంట గ్యాస్ సిలిండర్ల కొరతపై వస్తున్న వదంతుల్లో నిజం లేదని, ఉగాది వరకు సరిపడా గ్యాస్ నిల్వలు స్థానిక తమ గ్యాస్ గౌడంలలో ఉన్నట్లు ఏజెన్సీల నిర్వాహకులు తెలుపుతున్నారు. అందుకు తగ్గట్టుగానే కేంద్ర ప్రభుత్వం తీసుకున్న చర్యలతో గ్యాస్‌కు ఎటువంటి ఇబ్బందులు లేవని అధికారులు పేర్కొంటున్నారు. ఒక వేళ ఉగాది అనంతరం గ్యాస్ అయిపోయినప్పటికీ వెంటనే నింపి ఇచ్చే సామర్థ్యం ఉందన్నారు. కాబట్టి గ్యాస్ సరఫరా సాధారణంగానే కొనసాగుతోందని, ప్రజలు అపోహలకు లోనుకాకుండా అధికారిక సమాచారం మాత్రమే నమ్మాలని అధికారులు విజ్ఞప్తి చేస్తున్నారు.



### గ్యాస్ బుకింగ్‌లో అంతరాయం...

గ్యాస్ సిలిండర్ల కోసం పెద్ద ఎత్తున్న బుకింగ్‌లు ప్రయాత్నం చేస్తుండటంతో కాల్ సెంటర్ సేవల్లో అంతరాయం ఏర్పడుతోంది. వినియోగదారులు బుకింగ్ కోసం కాల్ చేస్తే ఎర్రర్ సందేశాలు వస్తున్నట్లు తెలుస్తోంది. దీంతో ఒకేసారి ఎక్కువ కాల్స్ రావడంతో గ్యాస్ బుకింగ్ కాల్ సెంటర్లలో సాంకేతిక సమస్యలు తలెత్తుతున్నాయని సమాచారం. కాల్ చేయగానే లైన్ కనెక్ట్ కాకపోవడం లేదా ఎర్రర్ సందేశాలు రావడంతో వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నారు. అయితే గ్యాస్ సరఫరాలో ఎలాంటి సమస్య లేదని, పెద్ద ఎత్తున బుకింగ్ ప్రయత్నిస్తుండటంతో తాత్కాలికంగా కాల్ సేవల్లో అంతరాయం ఏర్పడుతున్నట్లు అధికారుల తెలుపుతున్నారు. గ్యాస్ ఈకేవైసిని తప్పనిసరి చేస్తున్నారన్న ప్రచారం నేపథ్యంలో వినియోగదారుల్లో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దీనిపై గ్యాస్ ఏజెన్సీల వద్దకు వెళ్లి వివరాలు తెలుసుకుంటున్నారు. కేంద్రం ప్రభుత్వం ఈకేవైసీ చేసుకోవాలని చెప్పిన నేపథ్యంలో కలిసి వచ్చిన అవకాశాన్ని గ్యాస్ ఏజెన్సీలు ఇప్పుడు పకడ్బందీగా ఈకేవైసీ చేస్తున్నట్లు ఆరోపిస్తున్నారు. ప్రధానంగా ఇక్కడ భారత్, హెచ్‌పీ, ఇండియన్ గ్యాస్‌లు ఉండగా వీటి పరిధిలో 50వేల వరకు కనెక్షన్లు ఉన్నాయి. ఒక కుటుంబం 15సిలిండర్లు వరకు బుక్ చేసుకునే అవకాశం ఉంది. ఇందులో 12 సిలిండర్లకు ప్రభుత్వం సబ్సిడీని అందిస్తుండగా..మిగిలన మూడు సిలిండర్లకు మొత్తం డబ్బులు కట్టాల్సి ఉంటుంది. అయితే ఈ గ్యాస్ వాడకంలో ఒక కుటుంబం ఎంత ఎక్కువ వినియోగించిన 6నుంచి7 సిలిండర్లు అవసరమవుతాయి. కాగా మిగిలిన సిలిండర్‌లను ఏజెన్సీలు దొడ్డి దారిన బ్లాక్‌లో అమ్ముకొని, ఇప్పుడు ఈకేవైసీ పేరుతో ఆ దందాను సరి చేసుకునే పనిలో పడిపోయినట్లు తెలిసింది.

### చట్టపరమైన చర్యలు తీసుకుంటాం : సివిల్ సప్లైస్ డీటీ, విజయ్‌బాబు



డొమేస్టిక్ సిలిండర్లను కమర్షల్‌కు వినియోగిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటాము. ఇప్పటికే కొన్ని హోటల్స్‌లో వినియోగిస్తున్న 18 డొమేస్టిక్ సిలిండర్లను సీజ్ చేశాము. గ్యాస్ లేదంటూ సాగుతున్న వందంతులను నమ్మవద్దు. అధికారిక సమాచారాన్ని మాత్రమే పరిగణలోకి తీసుకోవాలి.

## అదనపు తరగతి గదుల నిర్మాణానికి శంకుస్థాపన



**ప్రజాపక్షం/అశ్వాపురం:** అశ్వాపురం మండలం బిఏస్ గుంపు గ్రామంలోని ప్రభుత్వ ట్రైబల్ వెల్ఫేర్ ప్రైమరీ మోడల్ స్కూల్‌లో రూ 40లక్షల వ్యయంతో నిర్మించబోయే అదనపు తరగతి గదుల పనులకు ఎంఎల్‌ఏ పాయం వెంకటేశ్వర్లు శంకుస్థాపన చేశారు. అదే సందర్భంగా రూ 25వేల వ్యయంతో ఏర్పాటు చేసిన మినీ ఆర్ఓ ప్లాంట్‌ను ప్రారంభించారు. ఈసందర్భంగా ఎంఎల్‌ఏ మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల్లో విద్యా అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగుతున్నాయని తెలిపారు. ఈకార్యక్రమంలో ఎంపీడీవో ముత్యాలరావు, ఈఈ మధుకర్, ఐటిడిఏ ఏఈ ప్రసాద్, జీపీఓ లక్ష్మణ్, కాంగ్రెస్ మండల అధ్యక్షులు ఓరుగంటి భిక్షమయ్య, గాదె కేశవరెడ్డి, తుమ్మలచెరువు సర్పంచ్ ఎట్టి నరేష్, మనబోతులగూడెం సర్పంచ్ పోడియం పవన్, చాప ముత్తయ్య, ఊస అనిల్, లంక మల్లారావు, వేముల విజయ్, కోలా శశికాంత్, తోట విష్ణు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అనుబంధ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## సేవ్ సింగరేణి పోస్టర్ ఆవిష్కరణ

**ప్రజాపక్షం/మణుగూరు:** సింగరేణి కాలరీస్ వర్కర్ యూనియన్ ఏఐటియుసి ఆధ్వర్యంలో మార్చి 17న శ్రీరాంపూర్ లో సేవ్ సింగరేణి జాత ప్రారంభమై సింగరేణిలోని అన్ని ఏరియాల గుండా మార్చి 30న కొత్తగూడెంలో ధర్నా కార్యక్రమం తో ముగుస్తుందని అసిస్టెంట్ బ్రాంచ్ కార్యదర్శి కామ్రేడ్ మేకల ఈశ్వరరావు తెలిపారు. పీవీ కాలనీ కేవెల్ మహేంద్ర భవన్లో సేవ్ సింగరేణి జాత పోస్టర్ విడుదల సందర్భంగా సింగరేణిలో కొత్త బొగ్గు బావులు ప్రారంభించాలని, పాత విధానంలో మెడికల్ బోర్డును నిర్వహించాలని, రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాల్సిన రూ. 50 వేల కోట్ల రూపాయల బకాయిలను వెంటనే చెల్లించాలని, సింగరేణి కార్మికులకు సొంత ఇంటి పథకాన్ని అమలు చేయాలని, ఫెరాక్స్ పై ఇన్కమ్ టాక్స్ కంపెనీ చెల్లించాలని, కాంట్రాక్ట్ కార్మికులకు ఐపవర్ కమిటీ వేతనాలు చెల్లించాలని, మారు పేర్లు, డిస్మిస్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, స్ట్రక్చర్ సమావేశాలలో ఒప్పుకున్న వాటిని అమలు పరచాలనే డిమాండ్స్ తో జాత జరుగుతుందని కార్మికులందరూ ఈ జాతా కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ముఖ్యంగా మణుగూరు ఏరియాలో డిప్ సైడ్ బ్లాక్ ని సింగరేణికే కేటాయించాలని అన్నారు. యాజమాన్యం కార్మికుల న్యాయమైన సమస్యలు పరిష్కరించకపోతే సమ్మె అనివార్యం అని అన్నారు. కార్మికులందరూ సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఈ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో బ్రాంచ్ జాయింట్ సెక్రటరీ కామ్రేడ్ పుల్లారావు, ఆఫీస్ బేరర్ కామ్రేడ్ ఆవుల నాగరాజు, ఫిట్ సెక్రటరీలు గుంపెన శ్రీనివాసరావు, వర్క్ మెన్ ఇన్స్పెక్టర్ రాజేంద్రప్రసాద్, ఎగ్జిక్యూటివ్ నెంబర్ జానకి ప్రసాద్, తెన్నిటి నారాయణ, ఇ మా మొద్దీన్, కళ్యాణం రవికుమార్, యాకూబ్ పాషా, నీరుడు వెంకట్ నారాయణ, మట్టపర్తి నాగరాజు, నరహరి తదితరులు పాల్గొన్నారు.



# ఫుడ్ పాయిజన్ ఘటనపై చర్యలు

- డిప్యూటీ వార్డెన్, హెచ్ఎం సస్పెన్షన్
- కలుషిత ఆహారంతో విద్యార్థినులు అస్వస్థత
- నాణ్యమైన భోజనం అందించాలని కలెక్టర్ ఆదేశం

**ప్రజాపక్షం/మణుగూరు:** మణుగూరు పట్టణంలోని బీసీ బాలికల రెసిడెన్షియల్ స్కూల్‌లో జరిగిన ఫుడ్ పాయిజన్ ఘటనపై జిల్లా కలెక్టర్ అంకిత్ కఠిన చర్యలు తీసుకున్నారు. ఈ ఘటనకు బాధ్యులుగా భావిస్తూ డిప్యూటీ వార్డెన్, హెడ్‌మాస్టర్‌ను సస్పెండ్ చేసినట్లు అధికారులు తెలిపారు. గత ఆదివారం రాత్రి హాస్టల్‌లో భోజనం చేసిన అనంతరం విద్యార్థినులు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. వాంతులు, విరోచనాలతో బాధపడిన విద్యార్థినులను వెంటనే మణుగూరు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించి ప్రాథమిక చికిత్స అందించారు. మొత్తం ఇరవై నాలుగు మంది విద్యార్థినులు ఫుడ్ పాయిజన్‌కు గురైనట్లు అధికారులు తెలిపారు. ఈ ఘటనకు కారణం హాస్టల్‌లో తయారు చేసిన కలుషిత ఆహారమేనని ప్రాథమికంగా తేలింది. కనీస ఆహార నియమ నిబంధనలు పాటించకపోవడం, నాణ్యమైన ఆహారం అందించకపోవడం వల్లే ఈ పరిస్థితి ఏర్పడిందని అధికారులు పేర్కొన్నారు.



### కఠిన చర్యలు...

ఈ ఘటనపై స్పందించిన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అంకిత్ బాధ్యులపై వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నిర్లక్ష్యం వహించిన డిప్యూటీ వార్డెన్, హెడ్‌మాస్టర్‌లను సస్పెండ్ చేశారు. ప్రభుత్వ గురుకులాలు, హాస్టళ్లలో విద్యార్థులకు నాణ్యమైన, పరిశుభ్రమైన ఆహారం అందించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని కలెక్టర్ స్పష్టం చేశారు. ఇలాంటి ఘటనలు మళ్లీ జరగకుండా అన్ని హాస్టళ్లలో ఆహార నాణ్యతపై కట్టుదిట్టమైన పర్యవేక్షణ నిర్వహించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

## అభివృద్ధిని చూసి ఓర్వలేక బిఆర్ఎస్ విమర్శలు

-వ్యక్తిగత ఆరోపణలు మానాలి: పజిల్ బక్ష

**ప్రజాపక్షం/చంద్రుగొండ:** నియోజకవర్గంలో ఎంఎల్‌ఏ జారే ఆదినారాయణ చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక బీఆర్ఎస్ నాయకులు వ్యక్తిగత విమర్శలు చేస్తున్నారని అశ్వారావుపేట నియోజకవర్గ కాంగ్రెస్ సేవాదళ్ ప్రధాన కార్యదర్శి పజిల్ బక్ష ఆరోపించారు. శనివారం స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గండుగుపల్లి ఏకలవ్య పాఠశాలలో ఫుడ్ పాయిజన్ కారణంగా అస్వస్థతకు గురైన విద్యార్థులను వెంటనే మెరుగైన వైద్యం కోసం ఆసుపత్రికి తరలించేందుకు ఎంఎల్‌ఏ చర్యలు తీసుకున్నారని తెలిపారు. పూర్తి సమాచారం లేకుండానే విమర్శలు చేయడమం తగదన్నారు. నియోజకవర్గంలో విద్య, వైద్య రంగాల అభివృద్ధికి ఎంఎల్‌ఏ ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని చెప్పారు. ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా అనేక మంది రోగులకు ఆర్థిక సహాయం అందించి స్వయంగా చెక్కులు పంపిణీ చేసిన ఘనత కూడా ఎంఎల్‌ఏ జారే ఆదినారాయణకే దక్కుతుందని పేర్కొన్నారు. ఆశ్రమ, గురుకుల, ప్రభుత్వ పాఠశాలలను సందర్శిస్తూ సమస్యలను తెలుసుకొని పరిష్కార మార్గంలో పని చేస్తున్నారని తెలిపారు. అభివృద్ధి పనులు జరుగుతున్నప్పటికీ బీఆర్ఎస్ నాయకులు అవనవసర విమర్శలు చేయడం సరికాదని, వ్యక్తిగత ఆరోపణలు మాని ప్రజా అభివృద్ధికి సహకరించాలని సూచించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు, ఎంఎల్‌ఏలపై విమర్శలు చేసే ముందు బీఆర్ఎస్ నాయకులు ఆలోచించాలని హితవు పలికారు. ఈసమావేశంలో మండల కాంగ్రెస్ పార్టీ నూతన అధ్యక్షులు నల్లమోతు రమణ, సర్పంచ్ ఇస్లావత్ రుక్మిణి, వైస్ సర్పంచ్ అంతటి రామకృష్ణ, మండల యువజన అధ్యక్షులు మహేష్, బుంగ శ్రీను, తదితరులు పాల్గొన్నారు.



## స్త్రీ మూర్తిని గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యతగా భావించాలి



**ప్రజాపక్షం/మణుగూరు:** మణుగూరు మొల్ల స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో చెరుకుపల్లి ఉపేందర్ రావు అధ్యక్షతన కవయిత్రి మొల్ల జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులుగా విచ్చేసిన కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ప్రెసిడెంట్ బీరం సుధాకర్ రెడ్డి, శాలివాహన మండల అధ్యక్షులు దామర కుమార్ స్వామి, శాలివాహన కుల పెద్దలు విచ్చేసి ఈ కార్యక్రమాన్ని గొప్పగా నిర్వహించి మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి సంస్థ స్థాపకులు ఉపేందర్ రావు మొల్ల స్వచ్ఛంద సేవా సంస్థ మహిళా దినోత్సవ జ్ఞాపకం ఏర్పాటు చేసి మహిళలను అందరూ గౌరవించాలని నినాదంతో ఈ సంస్థను స్థాపించడం జరిగింది అన్నారు. ఈ సంస్థ స్థాపించడంలో మహిళలకు ప్రధాన పాత్ర ఇచ్చి భావితరాలకు స్త్రీ మూర్తిని గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యతగా భావించాలి అన్నారు. 14వ శతాబ్దంలోనే రామాయణాన్ని తెలుగులో రాసిన మహా కవయిత్రి మొల్ల ఆమె శ్రీకృష్ణదేవరాయల కాలంలోనే అష్టదిగా కవులలో ఒకరిగా పని చేశారన్నారు. ఆమె రామాయణాన్ని సాధారణమైన వాడుక భాషలోనే రామాయణాన్ని రచించడం వలన ప్రతి ఒక్కరికి అర్థమయ్యే రీతిలో ఆ రామాయణం ఉండడం ఆ మహాతల్లి కుమ్మరి కులంలో జన్మించడం కుమ్మర్ల అదృష్టంగా భావించి శాలివాహనులందరూ ఆమె జయంతిని ఘనంగా నిర్వహించారు అన్నారు. ఆమె జయంతిని అధికారికంగా నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో దామర కుమారస్వామి, నగునూరి శ్రీరాములు, గుడిమెట్ల కృష్ణ, సంస్థ ఉపాధ్యక్షులు ఉప్పాడి అనిత, సంస్థ సహాయ కార్యదర్శి తమ్మిశెట్టి రమాదేవి, కాంగ్రెస్ పార్టీ నాయకురాలు వరలక్ష్మి , సింగర్ జ్యోతి, సులోచన, రావులపెంట నరసరావు, దిగుల శేషయ్య, ఎంపెల్లి సాంబయ్య, ఉమా, శ్రీలత, సులోచన, పెద్ద ఎత్తున మహిళలు పాలొన్నారు.

## రోడ్డు విస్తరణ పనులతో దుమ్ము దుమారం..!

ఇబ్బందులు పడుతున్న ప్రజలు

**ప్రజాపక్షం/అన్నపురెడ్డిపల్లి:** అన్నపురెడ్డిపల్లి గ్రామంలో జరుగుతున్న ఫోర్ లేన్ రోడ్డు విస్తరణ పనుల వల్ల గ్రామ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పనుల సమయంలో ఎగిసిపడుతున్న దుమ్ముతో గ్రామం మొత్తం కమ్ముకుపోతుండటంతో ప్రజలు అసౌకర్యానికి గురవుతున్నామని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు పనుల కోసం భారీ యంత్రాలు, ట్రక్కులు నిరంతరం రాకపోకలు సాగించడం వల్ల మట్టి రోడ్లపై దుమ్ము మేఘాలు ఎగసిపడుతున్నాయి. దీంతో ఇళ్లలో, దుకాణాల్లో దుమ్ము పేరుకుపోయి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రత్యేకంగా చిన్న పిల్లలు, వృద్ధులు శ్వాస కోస సమస్యలు ఎదుర్కొంటున్నారని గ్రామస్తులు తెలిపారు. దుమ్ము కారణంగా దగ్గు, అలర్జీలు వంటి ఆరోగ్య సమస్యలు పెరుగుతున్నాయని వారు పేర్కొన్నారు. ఇళ్ల ముందు కూర్చోవడమే కష్టంగా మారిందని మహిళలు వాపోయారు. ఈ సమస్యపై సంబంధిత అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినప్పటికీ తగిన చర్యలు తీసుకోలేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.



రోడ్డు పనులు పూర్తయ్యే వరకు రోజుకు కనీసం రెండు మూడు సార్లు నీరు చల్లి దుమ్ము తగ్గించేలా చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు. పనుల సమయంలో గ్రామ ప్రజలకు ఇబ్బందులు లేకుండా అధికారులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

## ప్రోటోకాల్ మరచిన ఐటిసి అధికారులు



**ప్రజాపక్షం/బూర్గంపాడు:** నాగినేనిప్రోలు గ్రామ పంచాయితీలో చేపట్టిన అభివృద్ధి పనుల విషయంలో ఐటీసీ అధికారులు ప్రోటోకాల్ పాటించలేదని బీఆర్ఎస్ మండల అధ్యక్షులు గోపిరెడ్డి రమణారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామాభివృద్ధి కోసం ఐటీసీ సీఎస్ఆర్ నిధులతో రూ 50లక్షల వ్యయంతో సైడ్ డ్రైనేజీ పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకున్నప్పటికీ, శంకుస్థాపన కార్యక్రమానికి గ్రామ పంచాయితీ పాలకవర్గ సభ్యులను ఆహ్వానించకపోవడం సరైంది కాదన్నారు. బీఆర్ఎస్ పార్టీకి చెందిన సర్పంచ్ ఉండటంతోనే పాలకవర్గాన్ని పిలవకుండా కార్యక్రమం నిర్వహించారని ఆరోపించారు. ఏ పార్టీ అధికారంలో ఉన్న ఐటీసీ అధికారులు ప్రోటోకాల్ విషయంలో అందరిని సమానంగా చూడాలని సూచించారు. ఇకముందైనా ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను కోరారు.

## కోమటిరెడ్డి మోహన్‌రెడ్డికి ఘన నివాళి



**ప్రజాపక్షం/బూర్గంపాడు:** బూర్గంపాడు మండలం సారపాక గ్రామానికి చెందిన కోమటిరెడ్డి మోహన్‌రెడ్డి దశ దిన కర్మ కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామస్తులు, నాయకులు పెద్ద సంఖ్యలో హాజరై ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈకార్యక్రమానికి బూర్గంపాడు మండల మాజీ జెడ్‌పిటిసి కామిరెడ్డి శ్రీలతరామకొండారెడ్డి దంపతులు హాజరై మోహన్‌రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి ధైర్యం చెప్పారు. మోహన్‌రెడ్డి గ్రామాభివృద్ధికి చేసిన సేవలను ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. ఈకార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ముమ్వ వెంకటేశ్వర్లు, బీఆర్ఎస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ జలగం జగదీష్, తాళ్లగొమ్మూరు సర్పంచ్ గుమ్మడి కృష్ణవేణి, సారపాక టౌన్ అధ్యక్షులు కొనకంచి శ్రీను, బీఆర్ఎస్ నియోజకవర్గ యువజన వర్కింగ్ ప్రెసిడెంట్ చల్లకోటి పూర్ణచందర్, టౌన్ యువజన అధ్యక్షులు సోము లక్ష్మీ చైతన్యరెడ్డి, బెజ్జంకి కనకచారి, కర్రి రాజేంద్ర ప్రసాద్, పంగి సురేష్, సట్టు ఆంజనేయులు, దాసరి మోహన్, సానికొమ్ము రామచంద్రరెడ్డి, యారం వెంకటరెడ్డి, తదితర నాయకులు పాల్గొని మోహన్‌రెడ్డికి తమ నివాళులు అర్పించారు.

## ప్రశాంతంగా ప్రారంభమైన పది పరీక్షలు



**ప్రజాపక్షం/అన్నపురెడ్డిపల్లి:** అన్నపురెడ్డిపల్లి గ్రామంలో పదో తరగతి పబ్లిక్ పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు ఉదయం నుంచే పరీక్షా కేంద్రాలకు చేరుకుని ఉత్సాహంగా పరీక్షలు రాశారు. విద్యార్థులు సమయానికి కేంద్రాలకు చేరుకునేలా ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ చూపించారు. పరీక్షల నిర్వహణ కోసం విద్యాశాఖ అధికారులు ముందుగానే అన్ని ఏర్పాట్లు చేశారు. మండలంలో మొత్తం 250 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కావాల్సి ఉండగా, ఒకరు గైర్హాజరై 249 మంది పరీక్షలు రాసినట్లు మండల విద్యాశాఖ అధికారి ఉండేటి ఆనంద్ కుమార్ తెలిపారు. పరీక్షలు మరికొన్ని రోజుల పాటు కొనసాగనున్నాయని, విద్యార్థులు ధైర్యంగా పరీక్షలు రాసి మంచి ఫలితాలు సాధించాలని ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు ఆకాంక్షించారు.

## ప్రారంభమైన పదో తరగతి పరీక్షలు



**ప్రజాపక్షం/అశ్వాపురం:** రాష్ట్ర వ్యాప్తంగా శనివారం నుండి ప్రారంభమైన పదో తరగతి పరీక్షలు అశ్వాపురం మండలంలో ప్రశాంతంగా మొదలయ్యాయి. మండలంలో 6 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల నుండి మొత్తం 199 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నారు. మండలంలో అశ్వాపురం, మల్లెలమడుగు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను పరీక్షా కేంద్రాలుగా ఏర్పాటు చేశారు. అశ్వాపురం కేంద్రంలో 89 మంది, మల్లెలమడుగు కేంద్రంలో 110 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారని మండల విద్యాశాఖ అధికారి జి వీరస్వామి తెలిపారు. పరీక్షా కేంద్రాల్లో చీఫ్ సూపరింటెండెంట్లుగా కె రామారావు, గోపి విధులు నిర్వహిస్తున్నారు. సిబ్బందికి మొబైల్ ఫోన్లను అనుమతించకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. విద్యార్థులు పరీక్షలకు గంట ముందే కేంద్రాలకు చేరుకోవాలని, రవాణా సౌకర్యం లేని చోట తల్లిదండ్రులు సహకరించాలని ఎంఈఓ సూచించారు.

## 28 రోజుల ప్లాన్లతో దోపిడీ

**ప్రజాపక్షం/కారేపల్లి:** టెలికాం కంపెనీలు 30 రోజుల నెలను 28 రోజులుగా చూపిస్తూ వినియోగదారులను దోచుకుంటున్నారని సీపీఐ(ఎంఎల్)న్యూ డెమోక్రసీ వైరా ఇన్‌చార్జ్ భూక్యా శివనాయక్ విమర్శించారు. శనివారం కారేపల్లిలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ విధానం వల్ల వినియోగదారులు ఏడాదికి అదనంగా ఒకసారి రీఛార్జ్ చేయాల్సి వస్తోందన్నారు. రోజువారీ డేటా పూర్తిగా వినియోగించకపోయినా అర్ధరాత్రి తర్వాత మిగిలిన డేటాను తొలగించడం వినియోగదారుల వంచన అని పేర్కొన్నారు. అలాగే రీఛార్జ్ లేకపోతే ఇన్‌కమింగ్ కాల్స్ కూడా నిలిపివేయడం అన్యాయమని అన్నారు. ప్రతి ప్లాన్‌ను కనీసం 30 రోజుల కాలపరిమితితో అమలు చేయాలని, మిగిలిన డేటాను మరుసటి రోజుకు వినియోగించే అవకాశం కల్పించాలని, ఇన్‌కమింగ్ కాల్స్ నిలిపివేత విధానాన్ని రద్దు చేయాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. లేనిపక్షంలో ప్రజల తరపున ఉద్యమం చేపడతామని హెచ్చరించారు.

# కాంగ్రెస్ ప్రభుత్వంలోనే ప్రజాపాలన

## ఎమ్మెల్యే రాగమయి



ప్రజాపక్షం/ తల్లాడ : కాంగ్రెస్ ప్రభుత్వంలోనే ప్రజాపాలన జరుగుతుందని సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన 99రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా శనివారం మల్లవరం గ్రామపంచాయతీ నందు ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ మల్లవరం గ్రామపంచాయతీ పరిశుభ్రంగా ఉండేలా ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించేలా 99 రోజుల కార్యాచరణ ప్రణాళికను తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. గ్రామాలు పరిశుభ్రంగా ఉంటే ప్రజల ఆరోగ్యం కూడా బాగుంటుందన్నారు. ప్రతిఒక్కరూ తమ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం మన అందరి బాధ్యత అని పేర్కొన్నారు. ప్రభుత్వం చేపట్టిన ఈ కార్యక్రమానికి ప్రజలు సహకరించి మన ప్రాంతాన్ని పరిశుభ్రమైన అభివృద్ధి చెందిన ప్రాంతంగా తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు. అదేవిధంగా మల్లవరం గ్రామ అభివృద్ధికి తన సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే రాగమయిని మల్లరం గ్రామ సర్పంచ్ కటికి కిరణ్‌కుమార్, ఉపసర్పంచ్ గు(ర్రం యశోద చేతుల మీదుగా ఘనంగా సన్మానించటం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ ఎ.శ్రీధర్‌రాజు, ఎంపిఓ ఎ.సురేష్‌బాబు, కల్లూరు ఎఎంసి చైర్మన్ బాగం నీరజచౌదరి, వైద్యాధికారులు ప్రత్యూష, శ్రీకాంత్, గ్రామ కార్యదర్శి సిద్ధిక్‌మియా, టెక్నికల్ అసిస్టెంట్ రామకృష్ణ, ఎఎన్ఎంలు, ఆశాలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఈద్గా అభివృద్ధికి చేయూతనందిస్తాం

## ఎమ్మెల్యే రాందాస్‌నాయక్



ప్రజాపక్షం/వైరా: వైరాలో ముస్లింలకు ఇచ్చిన మాట ప్రకారం వైరా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ వైరా రిజర్వాయర్ సమీపంలో ఈద్గా కోసం ఎకరం భూమిని కేటాయించారు. దానికి సంబంధించిన ప్రతిపాదనను రెవిన్యూ అధికారులు ఎమ్మెల్యే రాందాస్‌నాయక్‌కు వివరించారు. ఆ స్థలం వద్దకు ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ శనివారం పిసిసి ప్రధాన కార్యదర్శి కట్ల రంగారావు, ఖమ్మం జిల్లా కాంగ్రెస్ మెడికల్ అండ్ హెల్త్ చైర్మన్ డాక్టర్ కాపా మురళీకృష్ణ, మార్కెట్ చైర్మన్ బోళ్ల గంగారావు, మున్సిపల్ వైస్ చైర్మన్ కట్ల సంతోష్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఈద్గా ప్రాంతానికి వెంటనే పనులు ప్రారంభించడంతో పాటు పూర్తిస్థాయిలో ఎలాంటి ఇబ్బంది కలగకుండా మట్టిని నింపాలని అధికారులు ఆదేశించారు. ఈ సందర్భంగా ముస్లిం మత పెద్దలు ఎమ్మెల్యే రాందాస్‌నాయక్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ గురులింగం, మున్సిపల్ డిఈ నరేష్‌రెడ్డి, ఏఈ శ్రీమన్య, మండల, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు శీలం వెంకటనర్సిరెడ్డి, ఏదునూరి సీతారాములు, వుండ్రు శ్యామ్‌బాబు, వేముల రత్నాకర్, పమ్మి అశోక్, వీరంశెట్టి సీతారాములు, ఫణితి శ్రీను, కంభంపాటి సత్యనారాయణ, తోటకూర శ్రీకాంత్,గంగవరపు కిషన్, ముదిగుండ్ల మహేష్, నవీన్, పలువురు ముస్లిం మత పెద్దలు తదితరులు మసీద్ కమిటీ అధ్యక్షుడు షేక్ నాయబ్ రసూల్, కార్యదర్శి షేక్ అబ్దుల్ రెహమాన్, కోశాధికారి షేక్ గౌస్, ఉపాధ్యక్షులు కొండ మీరా, ముస్లిం యూత్ అధ్యక్షుడు షేక్ మహమ్మద్ రిజ్వాన్, ఫిరోజ్, రహీం, యాసీన్, సాదిక్, సోందు సాహెబ్, అజీజ్ తదితరులు పాల్గొన్నారు.

# బిటెక్, ఎంబీఏ ఫలితాల్లో సాయిస్ఫూర్తి విద్యార్థుల ప్రతిభ

## జిల్లా స్థాయిలో మొదటి స్థానం



ప్రజాపక్షం/సత్తుపల్లి: ఖమ్మం జిల్లాలో బిటెక్ మొదటి సంవత్సరం, ఎంబీఏ మొదటి సంవత్సరం ఫైనల్ పరీక్షా ఫలితాల్లో సాయిస్ఫూర్తి అటానమస్ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చి అగ్రస్థానంలో నిలిచారు. జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ హైదరాబాద్ (జేఎన్‌టియూ హెచ్) అనుమతితో విడుదలైన ఈ ఫలితాల్లో విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబర్చారని కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ దాసరి ప్రభాకర్ రెడ్డి, ప్రిన్సిపాల్ డా. పూటుకూరి శేషారత్నకుమారిలు సంయుక్త ప్రకటనలో శనివారం తెలిపారు. బ్రాంచీల వారీగా ప్రకటించిన ఫలితాల్లో ట్రిపుల్ ఈ విభాగంలో ఎక్కిరాల శిరీష, పేటేటి లక్ష్మీ కార్తిక్ (7.67 ఎస్ జి పిఏ) మొదటి స్థానాన్ని సాధించగా, ఈసీఈ విభాగంలో గుగులోతు గణేష్ (9.43 ఎస్ జి పి ఏ) ప్రథమ స్థానం దక్కించుకున్నారు. సివిసి విభాగంలో పాలెం రమ్యస్ఫూర్తి (9.7 ఎస్ జి పిఏ) అత్యుత్తమ ఫలితంతో ముందంజలో నిలిచారు. సిఎస్‌యం విభాగంలో బమ్మిడి కళాంజలి (9.25 ఎస్ జి పిఏ), ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డేటా సైన్స్ విభాగంలో చాగంరెడ్డి దివ్యవాణి (9.25 ఎస్ జి పిఏ) ప్రథమ స్థానాలు సాధించారు. ఎంబీఏ విభాగంలో కిష్టం సాయికృష్ణ (8.59 ఎస్ జి పి ఏ) మొదటి స్థానాన్ని పొందారు. పరీక్షల్లో అగ్రస్థానాలు సాధించిన విద్యార్థులను ప్రముఖ పారిశ్రామికవేత్త, హెటిరో ఫార్మాస్యూటికల్ కంపెనీ అధినేత, రాజ్యసభ సభ్యుడు,సాయిస్ఫూర్తి ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్ డాక్టర్ బండి పార్థ సారథిరెడ్డి, విపాసన ఎడ్యుకేషనల్ ట్రస్ట్ బండి అన్విద వర్చువల్‌గా అభినందించారు. ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థుల సమిష్టి కృషి వల్లే ఈ విజయాలు సాధ్యమయ్యాయని వారు పేర్కొన్నారు. కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ దాసరి ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ ఇంజనీరింగ్ విద్యలో ఫస్ట్ క్లాస్ విత్ డిస్టింక్షన్ సాధించిన విద్యార్థులకు తగిన గ్రేడ్ పాయింట్లు కేటాయిస్తున్నామని తెలిపారు. పరీక్షల విజయానికి తొలి మెట్టు అని, విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో పట్టుదలగా చదివి మరిన్ని విజయాలు సాధించాలని సూచించారు. కళాశాల యాజమాన్యం విద్యార్థులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పిస్తూ విద్యతో పాటు వైజ్ఞానిక, సృజనాత్మక ప్రతిభను అభివృద్ధి చేస్తున్నదని తెలిపారు. తల్లిదండ్రులు పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని, విద్యార్థులు తమ తల్లి దండ్రుల ఆశయాలను నెరవేర్చాలని కోరారు. ఈ సందర్భంగా కళాశాల కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డా. పాముల శేఖర్ బాబు, ప్రిన్సిపాల్ డా. పూటుకూరి శేషారత్నకుమారి, వైస్ ప్రిన్సిపాల్ డా. షేక్ యాకూబ్, సైన్స్ , హ్యూమానిటీస్ విభాగాధిపతి డా. షేక్ మీరాసాహెబ్, అన్ని ఇంజనీరింగ్ విభాగాధిపతులు మెరుగైన ఫలితాలు సాధించిన విద్యార్థులకు అభినందనలు తెలిపారు.

# మైనార్టీల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది..



ప్రజాపక్షం/ఖమ్మం రూరల్ : ముస్లిం మైనార్టీల సంక్షేమం అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి పొంగులేటి క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జ్ తుబారు దయాకర్ రెడ్డి అన్నారు. శనివారం ఏదులాపురం మున్సిపాలిటీలోని ఆరవ వార్డులో గల మజీద్ వద్ద పేద ముస్లింలకు ప్రభుత్వం అందిస్తున్న రంజాన్ తోఫాను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన మైనార్టీ కుటుంబాలకు ఇళ్ల స్థలాలు అందించే చర్యలు చేపట్టినట్లు తెలిపారు. అందజేయబోవు స్థలాలలో శాశ్వత ఇండ్ల నిర్మాణాలకు మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ఆలోచన చేస్తున్నారన్నారు. ఆశ్రమ ఐలో ఉన్న ప్రభుత్వ భూములను గుర్తించి అవి తొలగించి ఇచ్చేందుకు కార్యాచరణ రూపొందిస్తున్నట్లు పేర్కొన్నారు. అలాగే ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ద్వారా మైనార్టీల జీవన ప్రమాణాలు మెరుగుపడేలా కృషి చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం ముస్లి సోదర సోదరీమణులకు రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో చైర్‌పర్సన్ పోకబత్తిని అనిత, వైస్ చైర్మన్ తమ్మినేని నవీన్, వార్డుల కౌన్సిలర్లు బుర్రా మహేష్, బానోతు దివ్య, వెంపటి ఉమా, కడవ నవీన్, ప్రసాద్ మున్సిపాలిటీ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# తొలిరోజు పది పరీక్ష ప్రశాంతం



ప్రజాపక్షం/కొణిజర్ల : మండలంలో పది పరీక్ష తొలిరోజు ప్రశాంతంగా జరిగింది. మండల కేంద్రం కొణిజర్లతోపాటు తనికెళ్ల హైస్కూల్, తనికెళ్లలోని సెయింట్ అలోషియస్ పాఠశాల, సింగరాయపాలెం గ్రామాల్లో జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలల్లో పదోతరగతి పరీక్ష శనివారం నిర్వహించారు. కొణిజర్లలో 208 మంది విద్యార్థులకు గాను 208 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. తనికెళ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 150 మందికి గాను 150 మంది హాజరయ్యారు. సెయింట్ అలోషియస్ పాఠశాలలో 143 గాను 143 మంది హాజరయ్యారు. సింగరాయపాలెం పాఠశాలలో 135 మందికి 135 మంది హాజరయ్యారు. మొత్తంగా 636 మంది విద్యార్థులకు పూర్తిగా పరీక్ష రాశారు. పరీక్షా కేంద్రాల వద్ద పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయడంతో పరీక్ష ప్రశాంతంగా జరిగింది.

# సమస్యల పరిష్కారానికే ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక



ప్రజాపక్షం/వైరా: వైరా మున్సిపాలిటీ పరిధిలోని 9వ వార్డులో వ్యవసాయ మార్కెట్ నందు ప్రజాపాలన ప్రగతి ప్రణాళి కార్యక్రమంలో భాగంగా క్లీన్ అండ్ గ్రీన్‌లో భాగంగా మున్సిపల్ సిబ్బందితో కలిసి మున్సిపల్ వైస్ చైర్మన్ కట్ల సంతోష్ శనివారం వ్యవసాయ మార్కెట్ చైర్మన్ గంగారావు, జిల్లా కాంగ్రెస్ మెడికల్ అండ్ హెల్త్ చైర్మన్ డాక్టర్ కాపా మురళీకృష్ణతో కలిసి శుభ్రత కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వైస్ చైర్మన్ కట్ల సంతోష్ మాట్లాడుతూ ప్రజాపాలన ప్రగతి కార్యక్రమం 99 రోజులపాటు కొనసాగుతుంది. ఈ కార్యక్రమంలో పారిశుద్ధ్య సమస్యల పరిష్కారం, క్లీన్ అండ్ గ్రీన్‌తో పాటు పెండింగ్ పనులు అన్ని పూర్తి చేయడం జరుగుతుందని అన్నారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టింది. ప్రతిఒక్కరూ రాజకీయాలకు అతీతంగా 99 రోజుల ప్రణాళిక కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వైరా వ్యవసాయ సంచాలకులు తుమ్మలపల్లి కరుణశ్రీ,, మార్కెట్ కార్యదర్శి మొషిన్ సుల్తానా, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు వెంకటనర్సిరెడ్డి, పమ్మి అశోక్, వీరంశెట్టి సీతారాములు, మిట్టపల్లి రాఘవరావు, కంభంపాటి సత్యనారాయణ, ఏలూరి వీరయ్య, మార్కెట్ కమిటీ డైరెక్టర్ బి.వి.నాగేశ్వరరావు, నవీన్, ముదిగొండ్ల మహేష్, తోటకూర శ్రీకాంత్, గంగవరపు కిషన్ తదితరులు పాల్గొన్నారు.

# జ్యోతిరావు పూలే పాఠశాల సందర్శన



ప్రజాపక్షం/వైరా: వైరా మున్సిపాలిటీ 13వ వార్డు ఓల్డ్ కెవిసిలో ఉన్న మహాత్మా జ్యోతిరావు పూలే పాఠశాలను ఆ వార్డు కౌన్సిలర్ ముళ్ళపాటి విజయ, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ ముళ్ళపాటి సీతారాములు పరిశీలించారు. మౌళిక వసతులను ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ ముళ్లపాటి విజయ సీతారాములు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గురుకుల విద్యార్థులకు అందిస్తున్న పౌష్టికాహార విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉందని, ప్రభుత్వం విద్యపై పెడుతున్న ఖర్చును మానవవనరుల అభివృద్ధికి, దేశాభివృద్ధికి సూచికగా నిలిచింది అన్నారు. అనంతరం పాఠశాలలో ఉన్న మున్సిపాలిటీ వాటర్, శానిటేషన్ సమస్యలను కౌన్సిలర్ దృష్టికి తీసుకొని రాగా వెంటనే మున్సిపల్ అధికారులకు తెలియజేసి వాటిని పరిష్కరించే విధంగా అక్కడికక్కడే కృషి చేశారు. మిగిలిన ఇంకొన్ని సమస్యలను శాసన సభ్యులు మాలోతు రాందాస్‌నాయక్ ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకొని వెళ్లి వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు.

# సైడ్ కాలువల్లో పూడికతీత పనులు



ప్రజాపక్షం/తల్లాడ : తల్లాడ మేజర్ గ్రామపంచాయతీలో 99 రోజుల ప్రజాపాలన ప్రగతిపాలన ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమంలో భాగంగా శనివారం గౌడ బజార్లో రోడ్డుకు ఇరువైపుల ఉన్న సైడు కాలువల్లో మట్టితో పేరుకుపోయి దుర్వాసనతో ప్రజలు ఇబ్బంది పడుతుండటంతో సర్పంచ్ నాగేశ్వరరావు, ఉపసర్పంచ్ కె.లక్ష్మారెడ్డి, గ్రామపంచాయతీ ఈఓ కృష్ణారావు ఆధ్వర్యంలో శనివారం పూడికతీత పనులు నిర్వహించారు. కేతినేని థియేటర్ ఎదురుగా జెసిబితో సిమెంట్ పైపుల్ని అమర్చి మురికినీరు బయటకుపోయే విధంగా పనులు ప్రారంభించారు. నారాయణపురం ముస్లిం బజార్లో మంచినీటి కొరత ఏర్పడడంతో నూతన పైప్‌లైన్ నిర్మాణ పనులు ప్రారంభించారు. నారాయణపురం పాత చర్చి వద్ద సైడ్ కాలువల పూడికతీత పనులు కూడా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

# దివ్యాంగులకు వీల్ చైర్లు పంపిణీ



ప్రజాపక్షం/సత్తుపల్లి: పట్టణంలోని ఆశ్రమ స్వచ్ఛంద సేవా సంస్థలో స్ఫూర్తి ఫౌండేషన్ సభ్యుడు వరకా రామారావు ఆధ్వర్యంలో దాతల సహకారంతో దివ్యాంగులకు నాలుగు వీల్‌చైర్లను శనివారం అందజేశారు. వీల్‌చైర్లను సత్తుపల్లి ఎఎంసీ చైర్మన్ దోమ ఆనంద్‌బాబు చేతుల మీదుగా అందించారు. ఈ సందర్భంగా దివ్యాంగులు మాట్లాడుతూ సమాజంలో తాము ఎదుర్కొంటున్న ఇబ్బందులను వివరించారు. రోజువారీ అవసరాలకు బయటకు వెళ్లడానికైనా ఇతరుల సహాయం అవసరమవుతుందని, అనేక కష్టాలు ఎదుర్కొంటున్నామని తెలిపారు. తమ పరిస్థితిని గుర్తించి స్ఫూర్తి ఫౌండేషన్ ద్వారా వీల్‌చైర్లు అందించిన ఫౌండేషన్ చైర్మన్ శ్రీవ్యాల్, దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. తమ వైకల్యాన్ని కొంతమేర మర్చిపోయేలా ఈ సహాయం ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని పేర్కొన్నారు. స్ఫూర్తి ఫౌండేషన్ అందించిన సహాయానికి ఆశ్రమ స్వచ్ఛంద సేవా సంస్థ తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పిల్లి మల్లికార్జున్, బల్లెం చిరంజీవి, వేము రమేష్, బాలాజీ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# బిజెపిది ప్రజా వ్యతిరేక పాలన

**- బిజేపి,ఆర్ఎస్ఎస్ ప్రయత్నాలు తిప్పికొట్టాలి : పశ్య పద్మ**
**మహిళా ప్రతినిధులపై మరింత బాధ్యత : అక్కినేని వనజ**




**ప్రజాపక్షం/పాల్వంచ :** దేశంలో బిజేపి ప్రభుత్వం ప్రజా వ్యతిరేక పాలనను కొనసాగిస్తున్నదని దీనితో పేదరికం పెరిగిపోతున్నదని సిపిఐజాతీయ కార్యవర్గ సభ్యులు పశ్య పద్మ ఆందోళన వ్యక్తం చేశారు. పాల్వంచలో నిర్వహించిన రెండు రోజుల పాటు నూతనంగా ఎన్నికైన కార్పోరేటర్లు, మున్సిపల్ వార్డ్ కౌన్సిలర్‌లు, సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌ల రాష్ట్ర స్థాయి శిక్షణా తరగతులు శనివారం ముగిశాయి. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కమ్యూనిస్టు నాయకులుగా సిపిఐ పార్టీ తరుపున ఎన్నికైన ప్రజా ప్రతినిధులు ఎలాంటి మచ్చలేకుండా అవినీతికి పాల్పడకుండా ఆ పరిస్థితి రాకుండా నికరంగా ప్రజా పాలన అంటే ఇది అని చెప్పటానికి నిదర్శనంగా మీ పాలన కొనసాగించాలని కాంక్షించారు. దేశంలో బిజేపి ప్రభుత్వం మతాలు, కులాల మధ్యన చిచ్చులు పెడుతూ తిరిగి గెలవాలని ప్రయాత్నాలు చేస్తున్నదని ఆరోపించారు. మత మౌఢ్యానికి వ్యతిరేకంగా ప్రజా స్వామితాయుతమైన ప్రజలను సమీకరించి బిజేపి, ఆర్ఎస్ఎస్ ప్రయత్నాలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. అనంతరం మహిళా ప్రజాప్రతినిధులపై మరింత బాధ్యత ఉందని దానిని నెరవేర్చటానికి అహర్నిషలు కష్టపడాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర




కార్యదర్శి వర్గ సభ్యురాలు అక్కినేని వనజ అన్నారు.ముఖ్యంగా మహిళా ప్రజాప్రతినిధులపై మరింత గురతర బాధ్యత ఉందన్నారు. ఒకవైపు కుటుంబ భారం, ఎన్నుకొన్న ప్రజల సమస్యల పరిష్కారం మరోవైపు ఉంటుందని ఈ రెండింటిని సమన్వయం చేసుకొంటూ ముందుకు సాగాలని సూచించారు. రాబోయే రోజుల్లో 33 శాతం రిజర్వేషన్‌తో మరిన్ని పదవులు మనకు వచ్చే అవకాశం ఉందని వాటి బాధ్యతలను సైతం సమర్థవంతంగా నిర్వహించటానికి మానసిక దృఢత్వాన్ని పెంపొందించుకోవాలని చెప్పారు. ప్రజలు మనపై నమ్మకంతో మనల్ని ఎన్నుకొన్నారని వారి నమ్మకాన్ని నిలబెడుతూ పాలన సాగించటానికి మీ హక్కులు, బాధ్యతలపై అవగాహన కలిగి ఉండాలని వాటిపై పట్టు పెంచుకోగలిగితే రాజకీయాలలో, ప్రజా సేవలో రాణిస్తారని అన్నారు. కావునా మహిళా ప్రజాప్రతినిధులు తమ విధులపట్ల జాగ్రత్తగా ఉంటూ నీతి, నిజాయితీ, విలువలతో కూడిన రాజకీయాలు చేయాలన్నారు. అప్పుడే ప్రజలు మనల్ని గుర్తుపెట్టుకొంటారని తెలిపారు. మరోసారి అవకాశం వెతుక్కుంటూ వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కమ్యూనిస్టు పార్టీ తరుపున ఎన్నికైన మీరు పార్టీ విస్తరణతో పాటు ప్రజా సమస్యల పరిష్కారానికై అహర్నిశలు పాటుపడాలన్నారు.

# నూతన బీటీ రోడ్డు పనులకు శ్రీకారం

**పనులను ప్రారంభించిన పినపాక ఎమ్మెల్యే పాయం**



**ప్రజాపక్షం/మణుగూరు:** మణుగూరు మండల పరిధిలో ప్రజల చిరకాల వాంఛ అయిన మణుగూరు నుండి భద్రాద్రి థర్మల్ పవర్ స్టేషన్ (బీటీపీఎస్) మీదుగా బయ్యారం క్రాస్ రోడ్ వరకు ఉన్న ప్రధాన రహదారి పునరుద్ధరణ పనులకు పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు శ్రీకారం చుట్టారు. రూ. 50 లక్షల వ్యయంతో చేపట్టిన ఆర్ అండ్ బి బీటీ రోడ్డు పనులు ప్రారంభమయ్యాయి. గత కొద్ది నెలలుగా ఈ రహదారి భారీ గుంతలతో అధ్వానంగా మారి వాహనదారులు, ద్విచక్ర వాహనదారులు, పాఠశాల బస్సులు, విద్యార్థులు, బీటీపీఎస్ ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రజల విజ్ఞప్తి మేరకు ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ప్రత్యేక చొరవతో నిధులు మంజూరు చేయించి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ నియోజకవర్గంలో ప్రజల సౌకర్యార్థం రహదారుల అభివృద్ధికి తాము కట్టుబడి ఉన్నామని తెలిపారు. రోడ్డు పనులను అత్యంత నాణ్యతా ప్రమాణాలతో వేగంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను, కాంట్రాక్టర్లను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్ అండ్ బి సతీష్, మండల అధ్యక్షులు పీరినాకి నవీన్, టౌన్ అధ్యక్షులు శివ సైదులు, సమితి సింగారం ఉపసర్పంచ్ గాండ్ల సురేష్, ఐఎన్టీయూసీ రాష్ట్ర నాయకులు సామా శ్రీనివాస్ రెడ్డి, 14 టైర్ అధ్యక్షులు దుగ్గంపూడి ఈశ్వర్ రెడ్డి, 12 టైర్ సెక్రెటరీ సురేందర్ రెడ్డి, మాజీ సర్పంచ్ తాటి భిక్షం, అబ్దుల్లా, తుపూడి శ్రీను, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## శ్రీరక్ష ఆరోగ్య యాత్రను ప్రారంభించిన జివి



**ప్రజాపక్షం/ బోనకల్ :** ఖమ్మంలోని ప్రముఖ హాస్పటల్ శ్రీరక్ష వారి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీరక్ష ఆరోగ్య యాత్రను శనివారం బోనకల్‌లో డాక్టర్ జివి, గ్రామ సర్పంచ్ బానోతు జ్యోతి, ఉపసర్పంచ్ బానోతు కొండాతో కలిసి ప్రారంభించారు. బోనకల్ గ్రామంలో అన్ని వీధుల వెంట ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ శ్రీరక్ష ఆరోగ్య యాత్రలో భాగంగా నిర్వహించే వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, హాస్పటల్ సిబ్బంది, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## ఇస్లావత్ తండా సర్పంచ్
# వార్డు సభ్యుడిపై దాడి

**-గ్రామపంచాయతీలో జరిగిన పనులపై ప్రశ్నించినందుకు దాడి**
**-వార్డు సభ్యుల సంతకాలు పోర్జరీ చేస్తున్న పంచాయతీ కార్యదర్శి**



**ప్రజాపక్షం/తిరుమలాయపాలెం :** గ్రామపంచాయతీలో జరుగుతున్న పనుల వివరాలను నిధుల వినియోగంపై నిలదీసిన వార్డు సభ్యుడు పై మహిళ సర్పంచ్ దాడి చేసి తీవ్రంగా అవమానించిన సర్పంచ్ ని విధుల నుంచి తొలగించాలని వార్డు సభ్యుల డిమాండ్ వాటి సభ్యుడు తెలిపిన వివరాలు ప్రకారం మండల పరిధిలోని ఇస్లావత్ తండాలో ఇటీవల జరిగిన గ్రామపంచాయతీ ఎన్నికల్లో ఏర్పడ్డ పాలకవర్గంలో సర్పంచ్ తో పాటు మెజార్టీ వార్డు సభ్యులు వారి వైపు ఉన్నారని ఇష్టానుసారం బిల్లులు డ్రా చేసుకుంటూ గ్రామంలో పనులు నిర్వహించట్లేదని ఇస్లావత్ తండా నాలుగవ వార్డు సభ్యుడు ఇస్లావత్ రాజా ఆరోపిస్తున్నాడు. గ్రామంలో ప్రతినెల 17వ తారీకు గ్రామ సభ నిర్వహణలో భాగంగా పంచాయతీ కార్యదర్శి భూక్య సురేష్ నాయక్ తీర్మానంపై సంతకం చేయాలని తీర్మానం పంపించగా నిరాకరించాడు. గ్రామ పంచాయతీలో వార్డు సభ్యులు అంతా ఉండగా పనుల వివరాలను నిధుల వినియోగంపై సర్పంచ్ ఇస్లావత్ సునీతని పంచాయతీ కార్యదర్శి సురేష్ ను వివరాలు అడగగా నీకేంటి చెప్పేది అని సర్పంచ్ ఇస్లావత్ సునీత భర్త రవి వార్డు సభ్యుడు ఇస్లావత్ రాజూ పై భౌతిక దాడి చేసి బండ బూతులు తిట్టి అవమానించారని, ఒక గౌరవప్రదమైన సర్పంచ్ పదవిలో ఉండి తోటి వార్డు సభ్యుడు పై దాడి చేయడం సరైన పద్ధతి కాదని అంతేకాకుండా సర్పంచ్ భర్త అయినా రవి ప్రభుత్వ ఉద్యోగిగా ఉంటూ పంచాయతీ పనులలో ప్రతి విషయంలో తాను కలుగజేసుకుంటూ పంచాయతీ అభివృద్ధికి అడ్డుపడుతున్నాడని ఆయన ఆరోపిస్తూ ఈ విషయంపై జిల్లా కలెక్టర్ వెంటనే స్పందించి సంబంధిత సర్పంచ్ ని పదవి నుంచి తొలగించాలని ఆయన డిమాండ్ చేస్తున్నారు.

## పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసిన కలెక్టర్



**ప్రజాపక్షం/పాల్వంచ :** పదవ తరగతి పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయని జిల్లా కలెక్టర్ అంకిత్ అన్నారు. పాల్వంచ పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, జిల్లా పరిషత్ ఉన్నత బాలికల అభ్యుదయ పాఠశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాలను శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరీక్షా కేంద్రాలలో మౌళిక వసతుల కల్పన తదితర ఏర్పాట్లను పరిశీలించారు. సిసి కెమెరాలు, తాగునీటి వసతి, విద్యుత్, వసతులపై అధికారులకు తగు సూచనలు, సలహాలను అందించారు. పరీక్షలు రాస్తున్న విద్యార్థుల హాజరు వివరాలు అడిగి తెలుసుకొన్నారు. విద్యార్థులు ఎలాంటి ఒత్తిడికి గురికాకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాసే విధంగా. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సంభందిత అధికారులు తగు చర్యలు తీసుకోవాలని సూచించారు.అభ్యుదయ పాఠశాలలో 210 మందికి గాను ఒకరు గైర్హాజరు కాగా 209 మంది హాజరయ్యారు. ఉన్నత పాఠశాల కేంద్రంలో 135 మందికి గాను 131 పరీక్షలకు హాజరయ్యారు.

## పది పరీక్షలు ప్రారంభం



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** పది పరీక్షలు శనివారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. మండలం లోని సింగారెడ్డిపాలెం గురుకుల పాఠశాల, చెరువుమాధారం ఉన్నత పాఠశాల, నేలకొండపల్లి మండల కేంద్రం లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. మొత్తం 425 మందికి 424 మంది హాజరయ్యారు. పరీక్ష కేంద్రాలను మండల విద్యాశాఖాధికారి బాలిన చలపతిరావు పర్యవేక్షించారు. స్థానిక పోలీస్ స్టేషన్ నుంచి ప్రశ్నాపత్రాలను డిపార్ట్మెంట్ ఆఫీసర్లు తీసుకెళ్లారు. అర గంట ముందే విద్యార్థులు పరీక్ష కేంద్రాలలోకి వెళ్లారు.

## ప్రశాంతంగా ప్రారంభమైన పది పరీక్షలు

**ప్రజాపక్షం/ బోనకల్ :** బోనకల్ మండలంలో పదో తరగతి పబ్లిక్ పరీక్షలు శనివారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. మండలంలోని అన్ని పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులు పూర్తి హాజరుతో పరీక్షలకు హజరయ్యారు. మండల పరిధిలోని రావినూతల జెడ్పి హైస్కూల్‌లో 140మంది విద్యార్థులు ఉండగా అందరూ పరీక్షకు హాజరయ్యారు. అలాగే బోనకల్ జడ్పి హైస్కూల్‌లో 129మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. జానకీపురం జెడ్పి హైస్కూల్ 119మంది విద్యార్థులు పరీక్ష రాశారు. మొత్తంగా మండలంలో మూడు కేంద్రాల్లో కలిపి 388మంది విద్యార్థులు ఉండగా అందరూ పరీక్షలకు హాజరయ్యారు. పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించేందుకు విద్యాశాఖ అధికారులు తగిన ఏర్పాట్లు చేశారు. పరీక్షా కేంద్రాల వద్ద ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పర్యవేక్షణ చేపట్టారు.

## రిటైర్డ్ ఉద్యోగుల బెనిఫిట్స్ మంజూరు చేయాలి



**ప్రజాపక్షం/చింతకాని :** మార్చి 2024 తర్వాత పదవీ విరమణ పొందిన ఉద్యోగుల రిటైర్ మెంట్ బెనిఫిట్స్ వెంటనే మంజూరు చేయాలని పిఆర్‌పిఏ జిల్లా కన్వీనర్ యలమద్ది వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం చింతకాని మండలం నాగులవంచ లో జరిగిన సంఘం ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2024 మార్చి తర్వాత రిటైర్మెంట్ పొందిన ఉద్యోగులు తాము దాచుకున్న డబ్బులను వెంటనే విడుదల చేసి వారిని ఆర్థిక సమస్యల నుండి విముక్తి పొందేలా ప్రభుత్వం వెంటనే చర్యలు చేపట్టాలన్నారు. ఉద్యోగ విరమణ పొంది 22 నెలలు గడుస్తున్నా గ్రాట్యువిటీ , జిఐఎస్, లీవ్ ఎన్ క్యాష్‌మెంట్ ఇవ్వక పోవడంతో పెన్షనర్లు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారన్నారు. తక్షణమే పెన్షనర్ల బెనిఫిట్స్ రిలీజ్ చేయాలని లేని పక్షంలో పెద్దెత్తున ఉద్యమిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు స్ మధుసూధన్ రెడ్డి, జి చంద్రశేఖర్, నంజాల పుల్లయ్య, అంబటి శాంతయ్య, డి శివనారాయణ రెడ్డి, ఎం బాబురావు, తాత రాఘవయ్య పాల్గొన్నారు.

## ముత్యాలమ్మ గుడి నిర్మాణానికి శంకుస్థాపన



**ప్రజాపక్షం/వైరా:** వైరా మున్సిపాలిటీ 4వ వార్డు రాజీవనగర్ కాలనీలో ముత్యాలమ్మ గుడి శంకుస్థాపన కార్యక్రమంలో వైరా మున్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ కాపా మురళీకృష్ణ, మార్కెట్ చైర్మన్ బోళ్ళ గంగారావు పాల్గొన్నారు. గుడి శంకుస్థాపన కార్యక్రమం వద్ద డాక్టర్ కాపా చంద్రకళ మురళీకృష్ణ దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం డాక్టర్ కాపా చంద్రకళ మాట్లాడుతూ రాజీవ్‌నగర్ అభివృద్ధికి వార్డు కౌన్సిలర్ శ్రావణితో కలిసి కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో వేముల రత్నాకర్, వాడపల్లి రామారావు, తోటకూర వీరబాబు, పలువురు నాల్గో వార్డు ప్రజలు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీలో చిన్నారులకు అక్షరాభ్యాసం



**ప్రజాపక్షం/కారేపల్లి:** మాదారం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు అక్షరాభ్యాస కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమం మాజీ ఎంపీటీసీ భాగం రూప నాగేశ్వరరావు, గ్రామ సర్పంచ్ అజ్మీరా ఉమా నరేష్ ఆధ్వర్యంలో జరిగింది. ఈసందర్భంగా చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించి వారి విద్యాభ్యాసానికి శ్రీకారం చుట్టారు. చిన్నారులు చిన్న వయసులోనే విద్యపై ఆసక్తి పెంపొందించుకొని భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదగాలని నాయకులు ఆకాంక్షించారు. గ్రామంలో అంగన్‌వాడీ కేంద్ర అభివృద్ధికి తాను కృషి చేస్తానని తెలిపారు. ఈకార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ అనంతమ్మ, వార్డు సభ్యులు అజ్మీర శారద, అజ్మీర రజిని, వంకుడుతు భారతి, అజ్మీర బాలాజీ, చాగంటి ప్రతిమ తదితరులు పాల్గొన్నారు.

# భారత దేశ చరిత్రలో ప్రస్తుతం చీకటి అధ్యాయం

**- ట్రంప్‌కు మోకరిల్లుతున్న మోడీ**
**- వామపక్ష పార్టీలు ఏకమై ముందుకు సాగాలి**
**- కొత్తగూడెం విజయాలు ఆదర్శం**
**- సిపిఐ జాతీయ కార్యదర్శి రామకృష్ణ**



**ప్రజాపక్షం/కొత్తగూడెం :** భారత దేశ చరిత్రలో జరుగుతున్న ప్రస్తుతం పరిస్థితులు చీకటి అధ్యాయమని, అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఇష్టాను రీతిగా దేశాల మీద దాడులు చేస్తూ విచక్షణా రహితంగా పసి పిల్లలను సైతం చంపుతుంటే భారతదేశ ప్రధాని నరేంద్రమోడి కమీసం నోరు మెదపకుండా ట్రంప్ కు మోకరిల్లినట్లు వ్యవహరిస్తున్నారని సిపిఐ జాతీయ కార్యదర్శి కే రామకృష్ణ అన్నారు. పాల్వంచలోని సుగుణ గార్డెన్స్‌లో సిపిఐ నుండి గెలిచిన ప్రజాప్రతినిధుల రాష్ట్ర వ్యాప్త శిక్షణా తరగతుల రెండో రోజు కార్యక్రమానికి హాజరైన ఆయన మాట్లాడారు. ఇంధన కొనుగోళ్ల విషయంలో ట్రంప్ ఆంక్షలు విధిస్తుంటే మోడి మౌన పాత్ర పోషించడం సరైంది కాదన్నారు. యుద్ధ కారణంగా ప్రాణాలు పోతున్నాయని, పసి పిల్లలు సమిదలు అవుతున్నారని, దీనిపై మోడి నోరు ఎందుకు మెదపరని ప్రశ్నించారు. అమెరిగా దురాఘతాలు పెరిగుతున్నప్పటికీ భారత ప్రధాని ట్రంప్‌కు భయపడుతూ చేష్టలుడికి కూర్చున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో నానాటీ పరిస్థితులు దిగజారిపోతున్నాయని, దీనిపై వామపక్ష లౌకిక శక్తులు ఐక్యమై ప్రజల్లో చైతన్యం తీసుకురావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కమ్యూనిస్టుల సహకారం లేకుంటే ప్రభుత్వాలు మనుగడను కోల్పోతాయని, దేశంలో యూపిఏ 1 ప్రభుత్వం ఉన్నప్పుడు ఉపాధిహామీ, సమాచార హక్కు, అటవీ హక్కుల చట్టం రూపొందాయని, యుపిఏ 2 ప్రభుత్వం నుండి వామపక్షాలు వైదొలగినప్పుపడు అన్నీ కుంభ కోణాలే చోటు చేసుకున్నాయన్నారు. తెలంగాణ గడ్డపై కమ్యూనిస్టులది త్యాగాల చరిత్ర అని, ఆ వీరోచిత చరిత్ర ఇప్పుడు కొత్తగూడెం నియోజకవర్గంలో పునరావృతం అవుతోందన్నారు. దేశ కమ్యూనిస్టు రాజకీయాల్లో కొత్తగూడెం నియోజకవర్గ విజయాలు ఆదర్శమని, ఎంఎల్ఏ కూనంనేని సాంబశివరావు గెలిచిన నాటి నుండి గ్రామ పంచాయితీ ఎన్నికలతో పాటు కార్పొరేషన్ ఎన్నికల్లోనూ విజయపరంపర కొనసాగిందని, రానున్న ఎంపిటిసి, జెడ్పిటిసి ఎన్నికల్లో ఇదే హవా కొనసాగాలన్నారు. జనవరి 18 ఖమ్మం జిల్లా కేంద్రంలో జరిగిన సిపిఐ శతవసంత ఉత్సవ ముగింపు సభ కనీవినీ ఎరుగని రీతిలో జరిగిందని, దీంతో కమ్యూనిస్టుల ఖిల్లా ఎరుపు వర్ణంగా మారిందన్నారు. ఈ వేడుకకు పెద్ద ఎత్తున యువత హాజరయ్యారని, దీనితో కమ్యూనిస్టు పార్టీ పట్ల యువత ఆకర్షితులవుతున్నారని అన్నారు. కొత్తగూడెం కార్పొరేషన్ నుండి గెలిచిన వారిలో 90 శాతం యువతరం ఉందని, ఇది శుభ పరిణామం అన్నారు. ప్రజాప్రతినిధులుగా ఎన్నికైన కమ్యూనిస్టులపై గురుతర బాధ్యత ఉందని, ప్రజలతో మమేకమై ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ పార్టీ విస్తరణకు పాటుపడాలని, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులుగా సుపరిపాలన అందించి ప్రజల్లో చెరగని ముద్ర వేయాలని కోరారు. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి, సర్పంచ్ సృజన్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పశ్య పద్మ, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా, బేజవాడ వెంకటేశ్వరరావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముత్యాల విశ్వనాధం, కల్లూరి వెంకటేశ్వరరావు, కర్రి బిక్షపతి, అజయ్ సారధి, మూడ్ గణేష్‌లు పాల్గొనగా మునిగడప పద్మ, ఉమా వాసిరెడ్డి మురళీ స్టీరింగ్ కమిటీ సభ్యులుగా వ్యవహరించారు.

# కమ్యూనిస్టులతోనే మెరుగైన రాజకీయాలు

**- ప్రజాప్రతినిధులు సుపరిపాలన దిశగా అడుగులేయాలి**
**- ప్రొ. నాగేశ్వర్**



**ప్రజాపక్షం/కొత్తగూడెం :** కమ్యూనిస్టులతోనే మెరుగైన రాజకీయాలు ప్రజలకు అందుతాయని, నూతనంగా ఎన్నికైన స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు సుపరిపాలన దిశగా అడుగులేయాలని ప్రొ.నాగేశ్వర్ అన్నారు. పాల్వంచ సుగుణ గార్డెన్స్ జరుగుతున్న సిపిఐ తరుపున నూతనంగా ఎన్నికైన ప్రజాప్రతినిధుల శిక్షణా తరగతుల్లో భాగంగా రెండో రోజు శనివారం హాజరైన ఆయన ప్రజా ప్రతినిధులుగా కమ్యూనిస్టుల పాత్ర అనే అంశంపై మాట్లాడారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం అనునిత్యం పాటువడాలని, అప్పుడే వారికి ప్రజల నుండి ఆదరణ అందుతుందన్నారు. యుపిఏ 1 ప్రభుత్వంలో కమ్యూనిస్టులు కలిసి ఉన్నప్పుడు ఉపాధిహామీ చట్టం, సమాచార హక్కు చట్టం, అటవీ హక్కుల చట్టం వంటి ప్రజా ప్రయోజన చట్టాలు అమల్లోకి వచ్చాయని, యుపిఏ 2 ప్రభుత్వం నుండి కమ్యూనిస్టులు వై దొలగినప్పుడు అన్నీ కుంభకోణాలో చోటు చేసుకున్నాయని అన్నారు. ప్రజలకు మెరుగైన పాలన అందాలంటే కమ్యూనిస్టుల పాత్ర ఎంతో అవసరమని గుర్తు చేశారు. కమ్యూనిస్టు ప్రజాప్రతినిధులు ప్రజాస్వామ్య విలువలు కాపాడుతూ పేదల పక్షన నిలుస్తూ అట్టడుగు వర్గాల అభ్యున్నతికి నిరతరం కృషి చేయాలన్నారు. గ్రామాల్లో పట్టణాల్లో మౌళిక సదుపాయాలకల్పన, తాగునీటి సమస్య పరిష్కారం, రహదారుల నిర్మాణం, వైద్య, వైద్య సదుపాయాలు వంటి అంశాలపై కమ్యూనిస్టు ప్రజాప్రతినిధులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ప్రజలకు ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు నిజమైన అర్హులకు చేరేలా పర్యవేక్షించడం, అవినీతి, అక్రమాలను అరికట్టేందుకు కృషి చేయడం కూడా బాధ్యతే అన్నారు. సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం అవసరమైనప్పుడు ముక్కు సూటిగా వ్యవహరించడం చేయాలన్నారు. ప్రజలతో నిరంతరం కలిసిమెలిసి సమస్యలను అర్థం చేసుకుని పరిష్కారం కృషి చేయడం ద్వారానే ప్రజా ప్రతినిధుల పాత్రకు సార్థకం అవుతుందని, ఇది కమ్యూనిస్టు ప్రజాప్రతినిధులకు మరీ ముఖ్యమన్నారు. సమానత్వం, సామాజిక న్యాయం, ప్రజాస్వామ్య పరిరక్షణ లక్ష్యాలతో కమ్యూనిస్టు పార్టీ ప్రతినిధులు ఎప్పటికీ ప్రజల పక్షాన నిలబడి పనిచేయాలని, చేస్తున్నారని నాగేశ్వరర్ స్పష్టం చేశారు. ప్రజా నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ ప్రజలకు మేలు చేసే దిశగా ముందుకు సాగుతూ కమ్యూనిస్టు ప్రజాప్రతినిధులు కట్టుబడి ఉండాలన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి, సర్పంచ్ సృజన్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎంఎల్ఏ కూనంనేని సాంబశివరావు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పశ్య పద్మ, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా, బేజవాడ వెంకటేశ్వరరావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముత్యాల విశ్వనాధం, కల్లూరి వెంకటేశ్వరరావు, కర్రి బిక్షపతి, అజయ్ సారధి, మూడ్ గణేష్‌లు పాల్గొనగా మునిగడప పద్మ, ఉమా వాసిరెడ్డి మురళీ స్టీరింగ్ కమిటీ సభ్యులుగా వ్యవహరించారు.

# అక్రిడేషన్ సమస్యలు పరిష్కరించండి

**-మీడియా అకాడమీ ఛైర్మన్‌కు ఐజెయు జిల్లా కమిటీ వినతి**





**ప్రజాపక్షం/ఖమ్మం :** జర్నలిస్టుల అక్రిడేషన్ మంజూరు విషయంలో ఉన్న సమస్యలను పరిష్కరించాలని, జీవోలో ఉన్న ఇబ్బందులను తొలగించాలని టియుడబ్ల్యూజె (ఐజెయు)శనివారం మీడియా అకాడమీ ఛైర్మన్ కె. శ్రీనివాసరెడ్డికి వినతి పత్రం సమర్పించారు. ఖమ్మం వచ్చిన శ్రీనివాసరెడ్డి టియుడబ్ల్యూజె (ఐజెయు) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. రాంనారాయణ ఇంటి వద్ద జరిగిన తేనేటి విందుకు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఐజెయు ప్రతినిధులు శ్రీనివాసరెడ్డికి వినతి పత్రం సమర్పించి అక్రిడేషన్ పొందెందుకు ఉన్న ఇబ్బందులను వివరించి వాటిని తొలగించాలని కోరా రు. వినతి పత్రం పరిశీలించిన శ్రీనివాసరెడ్డి కమిషనర్‌తో, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డితో మాట్లాడి పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. వినతి పత్రం సమర్పించిన వారిలో యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఏనుగు వెంకటేశ్వరరావు, మైసా పాపారావు, ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్ష, కార్యదర్శులు ఎం. భూపాల్, మహేందర్, జిల్లా కోశాధికారి నాగండ్ల శివానంద, నగర అధ్యక్ష, కార్యదర్శులు చెరుకుపల్లి శ్రీనివాస్, జనార్ధనాచారి, నాయకులు మోహినుద్దీన్, పసుపులేటి సత్యనారాయణ, యేగినాటి మాధవరావు, నామ పురుషోత్తం, ఆలస్యం అప్పారావు, రవి తదితరులు పాల్గొన్నారు. అనంతరం రెండవసారి మీడియా అకాడమీ ఛైర్మన్‌గా ఎన్నికైన శ్రీనివాసరెడ్డిని ఘనంగా సన్మానించారు.

# ప్రశాంతంగా పది పరీక్షలు

**-99.88 శాతం హాజరు**



**ప్రజాపక్షం/ఖమ్మం :**పది పరీక్షలు తొలి రోజున ప్రశాంతంగా జరిగాయి. శనివారం తెలుగు పరీక్షకు 99.88 శాతం మంది విద్యార్థులు హాజరయ్యారు. ఈ ఏడాది ఖమ్మం జిల్లాలో 16,962 మంది విద్యార్థులు పరీక్షలకు దరఖాస్తు చేయగా తొలి రోజున 16,641 మంది హాజరయ్యారు. ఖమ్మం జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి రెండు పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు. కొణిజర్లలో నిర్లక్ష్యంగా విధులు నిర్వహిస్తున్న చీఫ్ సూపరింటెండెంట్, డిపార్ట్‌మెంటల్ అధికారిని, అదే కేంద్రంలో సిట్టింగ్ స్క్వాడ్‌గా ఉన్న వారిని కూడా విధుల నుంచి తప్పించడం జరిగింది.

# పలు సిలెండర్లు స్వాధీనం



**ప్రజాపక్షం/ఖమ్మం :** హోటళ్లు, రెస్టారెంట్లలో జిల్లా పౌర సరఫరా అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించి శనివారం గృహ అవసరాలకు వినియోగిస్తున్న సిలెండర్లను స్వాధీనం చేసుకున్నారు. పలు హోటళ్లు, రెస్టారెంట్లలో గృహ అవసరాలకు ఉపయోగించాల్సిన సిలెండర్లను వినియోగించారని సంబంధిత హోటల్ యజమానులపై కేసులు నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు.గృహ అవసరాలకు వినియోగించే సిలెండర్లను ఉపయోగించరాదని వారు హెచ్చరించారు.

# దేవస్థానం ఛైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన కూరపాటి



**ప్రజాపక్షం/ఖమ్మం :** ఖమ్మం నగరంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన స్తంభాద్రి లక్ష్మి నర్సింహా స్వామి దేవస్థానం (గుట్ట) ఛైర్మన్‌గా ప్రముఖ వైద్యులు కూరపాటి ప్రదీప్‌కుమార్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. వేద మంత్రోచ్చరణల మధ్య దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారి సమత, ఈవో జగన్‌మోహన్‌రావు, వివిధ రంగాల ప్రముఖుల సమక్షంలో ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. ఛైర్మన్‌గా స్తంభాద్రి లక్ష్మి నర్సింహా స్వామి ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని, భక్తులకు సౌకర్యాలు కల్పిస్తానని ఆయన తెలిపారు. కమిటీ సభ్యులుగా కర్నాటి రాధిక, చిన్ని మధుసూదన్‌రావు, చల్లా మధుసూదన్‌రావు, మోర్ల శ్రీనివాస్, మందడపు సాయి వెంకటకృష్ణ, కొల్లా నాగేందర్, చారుగుండ్ల రవికుమార్, శెనగవరపు ప్రసాద్ కూడా బాధ్యతలు స్వీకరించారు.

# మధిరలో గ్లాకోమా అవగాహన ర్యాలీ



**ప్రజాపక్షం/ మధిర :** ప్రపంచ గ్లాకోమా వారోత్సవాల సందర్భంగా గ్లాకోమా వ్యాధిపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు మధిర పట్టణంలో శనివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ అంబేద్కర్ సెంటర్ నుండి రైల్వేస్టేషన్ రోడ్, ఫ్లైవర్ బ్రిడ్జి వరకు జరిగింది. మధిర సూపరింటెంట్ డాక్టర్ అనీల్‌కుమార్ మాట్లాడుతూ గ్లాకోమా కంటి చూపును నెమ్మదిగా దెబ్బతిసే ప్రమాదకర వ్యాధి అని తెలిపారు. ముఖ్యంగా 40 సంవత్సరాలపైబడిన వారు కంటి పరీక్షలు చేయించుకోవడం ద్వారా ముందుగానే గుర్తించి చికిత్స పొందవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏరియా ఆసుపత్రి ఆప్తాల్మాలజిస్టు డాక్టర్ రాజశేఖర్, పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ పృధ్వీరాజ్, వైద్య సిబ్బంది వెంకటేశ్వర్లు, గోవింద్, లంకా కొండయ్య, రిటైర్డ్ ఆయూష్ వైద్యులు డాక్టర్ అనంతయ్య, ఆశావర్కర్లు, అంగన్వాడీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ప్రశాంతంగా ప్రారంభమైన పది పరీక్షలు

**ప్రజాపక్షం/పెనుబల్లి:** మండలంలో మొత్తం 754 విద్యార్థులు ఉన్నారు. ఏడు జిల్లా పరిషత్‌లు, మోడల్, గురుకులాలు మూడు, కస్తూరిభా పాఠశాల లు ఉన్నాయి. మండలంలో నాలుగు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. శనివారం జరిగిన పరీక్షల్లో ముగ్గురు హాజరు కాలేదని అధికారులు తెలిపారు. సమయం కంటే ముందే విద్యార్థులను పరీక్ష హాల్ లోకి అనుమతించారు. ముందుగా పరీక్ష కేంద్రానికి చేరుకున్న విద్యార్థులు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అధికారులు ఏర్పాట్లు చేశారు. కట్టుదిట్టమైన భద్రతతో పరీక్షలు మొదటి రోజు ప్రశాంతంగా జరిగాయి

# ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి విద్యుత్ లైన్ ఆటంకం



**ప్రజాపక్షం/ తల్లాడ :** తల్లాడ గ్రామపంచాయతీ పరిధిలోని నారాయణపురం గ్రామంలో సంఘసాని శిరీషకు ఇందిరమ్మ ఇల్లు మంజూరైంది. దీంతో ఇందిరమ్మ ఇంటి నిర్మాణంలో భాగంగా గోడలు నిర్మించారు. అయితే సెంట్రింగ్ పెట్టడానికి ఇంటి పైన ఉన్న విద్యుత్ లైన్ ఆటంకంగా మారింది. సెంట్రింగ్ పెట్టడానికి ఎవరు సాహసించడం లేదని, దీంతో నిర్మాణ పనులు ఆగిపోయాయని, సమయానికి ఇల్లు నిర్మించుకోకపోతే బిల్లు ఆగిపోతుంతని బాధితురాలు సంఘసాని శిరీష ఆవేదన వ్యక్తం చేసింది. తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే మట్టా రాగమయి స్పందించి సమస్యను పరిష్కరించాలని బాధితురాలు వేడుకుంటుంది. విద్యుత్‌శాఖ అధికారులు స్పందించి విద్యుత్‌లైన్‌ను శ్లాబ్ వేయడానికి అనువుగా మార్చాలని విజ్ఞప్తి చేస్తున్నారు.